# నేటి నిజం

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ మంగళవారం 2-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 201 పేజీలు:6 వెల: రూ.1/-


## మూసీ నదికి పోటెత్తిన వరద.. పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం

నల్లగొండ మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మూసీ నదికి వరద పోటెత్తింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మూసీ నదికి వరద పరవళ్లు తొక్కుతోంది.

మూసీ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1,860 క్యూసెక్కులుగా ఉంది. మూసీ ఉపనది బిక్కేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సోలిపేట వద్ద ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాలను నిలిపివేశారు. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 632.7 అడుగులకు చేరింది.సూర్యాపేట, మేళ్లచెరువు, మఠంపల్లి, చివ్వెంల, హుజూర్‌నగర్, పాలకీర్దు మండలాల్లో సోమవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎలాంటి పంట నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.

## రైల్వే స్టేషన్లో పనిచేసే రైల్వే కూలీలను గుర్తించాలి

**-శ్రమను గౌరవిద్దాం..శ్రమను గుర్తిద్దాం..శ్రమనే ఆయుధంగా మలుచుకుందాం**

**-ప్రధానికి శివసేన్ (ఉద్దవ్ ఠాక్రే) తెలంగాణ రాష్ట్ర ప్రధన కార్యదర్శి ఏ సుదర్శన్ విజ్ఞప్తి**

హైదరాబాద్ మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);దేశంలో రైల్వే స్టేషన్లో పనిచేసే రైల్వే కూలీలను గుర్తించాలని శివసేన్ (ఉద్దవ్ ఠాక్రే) తెలంగాణ రాష్ట్ర ప్రధన కార్య దర్శి ఏ సుదర్శన్ డిమాండ్ చేసారు.మే డే పురస్కరించుకొని కాచిగూడ రైల్వే స్టేషన్ లో రైల్వే కూలీల మే డే ఉత్సవాళ్ళో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ వాళ్ల కు కనీస వేతనాల కింద నెలల జీతాలు మరియు హెల్త్ కార్డు వారికి రైల్వే క్వార్టర్స్ ఇవ్వాల్సిందిగా ప్రదాన మంత్రి నరేంద్ర మోడికి విజ్ఞప్తి చేసారు. కూలీలకు రైల్వే సంస్థ నుంచి రైల్వే( బిల్లా ) బ్యాచ్ గుర్తింపుగా ఇస్తారు కానీ వాళ్లకు కష్టం చేస్తేనే కూలి పని చేస్తేనే వాళ్లకు డబ్బులు వస్తాయి మీ ద్వారా దయచేసి రైల్వే సంస్థ నుంచి నెలకు 20000 రూపాయలు జీతాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. భారతీయ రైల్వే సంస్థ లో 15 లక్షల పైగా పనిచేస్తుంటారు. వాళ్ళ కుటుంబాలు బాగుపడతాయన్నారు. భారతదేశం మొత్తం రైల్వే కూలీలు కనీసం నాలుగు లక్షల మంది ఉంటారు మోడీ జి దయచేసి రైల్వే కూలీలను వారి కుటుంబాలను ఆదుకోవాలని సుదర్శన్ కోరారు.

## పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు.. సీపీగెట్ నోటిఫికేషన్ విడుదల



హైదరాబాద్, మే1: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి సోమవారం విడుదల చేశారు. ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, జేఎన్‌టీయూహెచ్, మహిళా యూనివర్సిటీల్లో సీపీగెట్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నారు.

ఈ నెల 12 నుంచి జూన్ 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. రూ.500 ఆలస్య రుసుముతో జూన్ 18 వరకు, రూ.2వేల ఆలస్య రుసుముతో జూన్ 20 వరకు ఫీజు చెల్లించవచ్చని సీపీగెట్ కన్వీనర్ తెలిపారు. సీపీగెట్ పరీక్ష జూన్ ఆఖరివారంలో జరుగనున్నది. ఈ యూనివర్సిటీల్లోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ వంటి సంప్రదాయ కోర్సుల్లో ప్రవేశాలను సీపీగెట్‌తో భర్తీ చేయనున్నది. పూర్తి వివరాల కోసం osmania.ac.in, cpget.tsche.ac.in, ouadmissions.com వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సీపీగెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి కోరారు.

## చలివేంద్రం ప్రారంభించిన స్టేట్ రెడ్ క్రాస్, చైర్మన్ అజయ్ మిశ్రా



హైదరాబాద్ మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి అధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా శాఖ ప్రాంగణం లో రెడ్ క్రాస్ స్టేట్ చైర్మన్ అజయ్ మిశ్రా రిటైర్డ్ కలెక్టర్, చలివేంద్రం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్ మిశ్రా మాట్లాడుతూ నిరంతరము సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న హైదరాబాద్ జిల్లా శాఖ ను ప్రశంసించారు. ఎండాకాలం ను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ను ఏర్పాటు చేసి వివిధ పనుల నిమిత్తం వచ్చే ఇతర గ్రామస్తులకు, ముఖ్యంగా పేదవారికి ఈ చలివేంద్రాలు ఎంతో ఉపకరిస్తాయి అని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేయాలని కొనియాడారు. ఆసిప్ నగర్, తహసీల్దార్ మాట్లాడుతూ ఏళ్ల వేళలు ప్రజలకు అందుబాటులో వుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ చైర్మన్ విజయ్ కుమారి, డా. విజయ్ భాస్కర్ గౌడ్, యం సి సభ్యులు వినయ్ కిశోర్, అనురాధ, మహ్మద్. రియాజుద్దీన్, ఎ. వి రావు, జై. ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, సుప్రభా,ఆయూభ్ ఖాన్, ధర్మ తేజ, రూపా దేవి, వెంకట్, మహేంద్ర రెడ్డి, లక్ష్మి, ఎ. పి లక్ష్మి,, శివ, నహీమ్, మమత, అనిత తదితరులు పాల్గొన్నారు

### నేటి కందం- నేటికి అందం


నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం


కం॥ తనువుకు బాధలనొసగుచు
తనరెడి "ఆస్త్మా"ను వెంట తరుముడటుంచున్
ఒనరుగ ప్రపంచ "ఆస్త్మా"
దినమున మనుజాళి కెల్ల తెలుపంగవలెన్!!



(మే 2 ప్రపంచ ఆస్త్మా దినం
World Asthma Day

-రాధశ్రీ
సెల్:9494481210

## జులై వరకు కరివెన జలాశయానికి నీటిని తరలించాలి.. అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం





హైదరాబాద్, మే1: కొత్తగా నిర్మించిన సచివాలయంలో తొలిసారి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

సుప్రీంకోర్టు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో తాగునీటి పనులను కొనసాగించేందుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించిన పనుల పురోగతిపై సీఎం కూలంకంషంగా చర్చించారు. ఇందులో భాగంగా జులై వరకు కరివెన జలాశయంకు నీళ్లు తరలించాలని, ఆగస్ట్ వరకు ఉద్దండాపూర్ వరకు నీటిని ఎత్తిపోయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.నార్లపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ జలాశయాల మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని.. పంప్‌హౌస్‌లు, విద్యుత్ సబ్ స్టేషన్లు, కన్వేయర్ సిస్టమ్‌లోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాలమూరు జిల్లాలో ఉన్న కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ పనులకు సంబంధించిన పురోగతిపై సమీక్షించారు. మిగిలిన కొద్దిపాటి పనులను ఈ జూన్ లోగా పూర్తి చేయాలని అధికారులను సీఎం సూచించారు.సమీక్షా సమావేశంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, వీ శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎంపీలు పోతుగంటి రాములు, మన్నె శ్రీనివాస్ రెడ్డి, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, కాలె యాదయ్య, ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, ఎస్ రాజేందర్ రెడ్డి, గువ్వల బాలరాజు, హర్షవర్ధన్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, అంజయ్య యాదవ్, ప్రకాశ్ గౌడ్, మహేశ్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జైపాల్ యాదవ్, మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ హాజరయ్యారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు, ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్ కుమార్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్ పాండే, ఈఎన్సీ మురళీధర్ రావు, లిఫ్ట్ ఇరిగేషన్ అడ్వైజర్ పెంటారెడ్డి, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఈలు హమీద్ ఖాన్, ధర్మా, ఎస్ఈలు రంగారెడ్డి, శ్రీనివాస్, విజయ భాస్కర్‌రెడ్డి, చక్రధర్, ఏఎస్ఎన్ రెడ్డి, ట్రాన్స్ కో డైరెక్టర్ సూర్య ప్రకాశ్, డీఈ పీఆర్ఎల్ఐఎస్ సయ్యద్ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లు : సీఎం కేసీఆర్

హైదరాబాద్ మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కార్మిక, కర్షక, శ్రమ జీవులకు ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక, కర్షక సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. చెమట చుక్కలను ధారపోసి పరోక్షంగా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న అందరికీ శుభాకాంక్షలు. తరతరాలుగా కష్టజీవి శ్రమతోనే ప్రపంచంలో సంపద దృష్టి జరుగుతోంది.

మహోన్నతమైన విశ్వమానవ సౌధానికి శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లు అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.కార్మిక, కర్షక, శ్రమ జీవులకు ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక, కర్షక సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. చెమట చుక్కలను ధారపోసి పరోక్షంగా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న అందరికీ శుభాకాంక్షలు. తరతరాలుగా కష్టజీవి శ్రమతోనే ప్రపంచంలో సంపద దృష్టి జరుగుతోంది. మహోన్నతమైన విశ్వమానవ సౌధానికి శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లు అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.కార్మికులు ప్రమాదం కారణంగా మరణిస్తే రూ. 6 లక్షలు ఆ కుటుంబానికి చెల్లిస్తున్నామని సీఎం తెలిపారు. 2014 నుంచి నేటి వరకు 4001 మంది బాధిత కుటుంబాలకు రూ. 223 కోట్లు చెల్లించాం. ప్రమాదం కారణంగా వైకల్యానికి గురైన రూ. 5 లక్షల చొప్పున 504 మంది కార్మికులకు రూ. 89 కోట్లు చెల్లించాం. కార్మిక కుటుంబంలోని ఇద్దరు ఆడపిల్లల పెండ్లికి రూ. 30 వేల చొప్పున వివాహ బహుమతి ఇస్తున్నాం అని కేసీఆర్ గుర్తు చేశారు. 2014 నుంచి నేటి వరకు 46,638 మంది లబ్ధిదారులకు రూ. 130 కోట్లు చెల్లించాం అని సీఎం తెలిపారు.మహిళా కార్మికులకు 2 కాన్పుల వరకు రూ. 30 వేల చొప్పున ప్రసూతి ప్రయోజనాలు అందిస్తున్నాం. 2014 నుంచి నేటి వరకు 1,01,983 మంది లబ్ధిదారులకు రూ. 280 కోట్లు చెల్లించాం. కార్మికులపై ఆధారపడిన 1,49,536 మంది లబ్ధిదారులకు రూ. 94 కోట్లు చెల్లించాం. మరణానంతరం అంతిమయాత్ర కార్యక్రమాలకు 39,797 మందికి రూ. 98 కోట్లు చెల్లించాం అని సీఎం కేసీఆర్ తెలిపారు.

## మౌనిక కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించిన మంత్రి తలసాని



హైదరాబాద్, మే1: చిన్నారి మౌనిక మృతి ఘటన చాలా బాధాకరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గత నెల 29వ తేదీన సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కళాసిగూడ నాలాలో పడి మరణించిన చిన్నారి మౌనిక కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 5 లక్షల ఆర్థిక సహాయం చెక్కును మంత్రి తలసాని సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు వారి నివాసంలో అందజేశారు. తమ బిడ్డను తలుచుకుంటూ రోదిస్తున్న మౌనిక తల్లిదండ్రులు శ్రీనివాస్, రేణుకలను మంత్రి ఓదార్చారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. అభంశుభం తెలియని చిన్నారి మృతి ప్రతి ఒక్కరినీ ఎంతో కలచి వేసిందని చెప్పారు. ఎంత చేసినా చిన్నారి లేని లోటును ఆ కుటుంబానికి తీర్చలేనిదని పేర్కొన్నారు. కడు పేదరికంలో ఉన్న మౌనిక కుటుంబం అవసరాలను తెలుసుకొని వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నగరంలో కోట్లాది రూపాయాల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఎన్నో సంవత్సరాల నుండి ఉన్న వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం చేపట్టి నాలాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా నే పలు కాలనీలు, బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న వరద సమస్యను పరిష్కరించినట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఇఇ సుదర్శన్, స్థానిక నాయకులు ఆంజనేయులు, విజయ్, భాస్కర్, జగత్ రావు తదితరులు ఉన్నారు.

## 'సఫాయన్న నీకు సలాం' నినాదంతో పారిశుధ్య కార్మికులను కృషిని గుర్తిస్తున్నాం : సీఎం కేసీఆర్



హైదరాబాద్, మే1: 'సఫాయన్న నీకు సలాం' నినాదంతో పారిశుధ్య కార్మికులను కృషిని గుర్తిస్తున్నామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవమైన మే డే రోజున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పారిశుధ్య కార్మికుల వేతనాలను సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం పెంచింది. రూ.వెయ్యి చొప్పున వేతనం పెంచుతూ.. తక్షణం అమలులోకి వచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సర్కారు నిర్ణయంతో జీహెచ్‌ఎంసీ, జలమండలి, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 1,06,474 మంది కార్మికులకు లబ్ధి జరుగనున్నది. ప్రస్తుతం జీతం అందుకుంటున్న పారిశుధ్య కార్మికులందరికీ నెల నెలా పెరిగిన వేతనం అదనంగా జీతంతో పాటు కలిపి అందనున్నది.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 'సఫాయన్న నీకు సలాం అన్న' అనే నినాదంతో పారిశుధ్య కార్మికుల కృషిని, త్యాగాలను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుండి గుర్తిస్తూ వారి సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని సీఎం అన్నారు. రాష్ట్రంలో కష్టించి పనిచేసే ప్రతీ ఒక్క కార్మికుని సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికుల జీతాలు కూడా పెంచాలని నిర్ణయించామని, ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్థిక శాఖను ఆదేశించినట్లు వెల్లడించారు. తెలంగాణ పల్లెలు, పట్టణాలు గుణాత్మక అభివృద్ధిని సాధించడంలో పారిశుధ్య కార్మికుల శ్రమ గొప్పదన్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన పల్లెలు, పట్టణాలకు అవార్డులు రావడం వెనుక వారి కృషి దాగి ఉన్నదని పేర్కొన్నారు. పల్లెలు, పట్టణాల్లో నాటి, నేటి పరిస్థితులకు ఎంతో స్పష్టమైన తేడా ఉన్నదని సీఎం అన్నారు. కార్మికుల కష్టసుఖాలను తెలుసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ వారి జీతాలను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ వారికి అండగా నిలబడిందని అన్నారు. తద్వారా పారిశుధ్య కార్మికులు కూడా అదే కృతజ్ఞత భావంతో మనస్ఫూర్తిగా పని చేస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావడంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు.

## విడాకులు కోరుకునే జంట ఆర్నెళ్లు వేచి ఉండాల్సిన అవసరం లేదు

**- ఆర్టికల్ 142 ప్రకారం వెంటనే విడాకులు : సుప్రీం కోర్టు**

న్యూఢిల్లీ మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): విడాకులపై సుప్రీంకోర్టు ఇవాళ కీలక తీర్పును వెలువరించింది. విడాకులు కోరుకునే జంట ఆర్నెళ్లు వేచి ఉండాల్సిన అవసరం లేదని కోర్టు తెలిపింది. కలిసి జీవించలేని పరిస్థితులు ఉన్నప్పుడు.. ఆర్టికల్ 142 ప్రకారం తన అధికారాలను ఉపయోగించుకుని.. దంపతులకు విడాకులు ఇవ్వవొచ్చు అని సుప్రీం కోర్టు చెప్పింది. దంపతులు ఇద్దరూ విడాకులకు అంగీకరిస్తే, హిందూ వివాహ చట్టం ప్రకారం ఆర్నెళు ఆగాల్సిన అవసరం లేదని కోర్టు వెల్లడించింది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, సంజీవ్ ఖన్నా, అభయ్ ఎస్ ఓకా, విక్రమ్ నాథ్, జేకే మహేశ్వరిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసులో తీర్పును వెలువరించింది.ప్రాథమిక హక్కులతో లింకున్న ఆర్టికల్ 142ని పరిగణలోకి తీసుకుని, కోర్టు తన అధికారాలతో న్యాయం చేస్తుందని సుప్రీం బెంచ్ తెలిపింది. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13-బీ ప్రకారం.. విడాకులు కావాలనుకునే జంట కచ్చితంగా ఆర్నెళ్లు వేచి ఉండాల్సి వస్తోంది. అయితే విడాకులు ఆశించే జంటలను ఫ్యామిలీ కోర్టులకు రెఫర్ చేయాల్సి అవసరం లేదని దాఖలైన పిటిషన్ల విచారణ సమయంలో కోర్టు ఈ అదేశాలు ఇచ్చింది.ఆర్టిక్ 142 ప్రకారం సుప్రీంకోర్టు అత్యవసర ఆదేశాలు జారీ చేసే అధికారం ఉంది. అయితే సంపూర్ణ న్యాయం చేసేందుకు తాము ఆ అధికారాలు వినియోగించే అవకాశం ఉందని కోర్టు తెలిపింది. ఆర్టికల్ 142 ప్రకారం వైవాహిక బంధాన్ని రద్దు చేసేందుకు సుప్రీంకోర్టుకు అధికారం ఉందా లేదా అన్న ప్రశ్న తలెత్తింది. ఈ నేపథ్యంలో ఓ కేసును 2016, జూన్ 29వ తేదీన అయిదుగురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేశారు. జస్టిస్ శివ కీర్తి సింగ్, ఆర్ భానుమతిలతో కూడిన బెంచ్ ఆ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి రెఫర్ చేసింది.ఆ కేసులో విచారణ చేపట్టిన రాజ్యాంగ ధర్మాసనం.. 2022, సెప్టెంబర్ 29వ తేదీన తన తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసులో కోర్టుకు సహకరించేందుకు సీనియర్ అడ్వకేట్లు ఇందిరా జైసింగ్, వీ గిరి, కపిల్ సిబల్, దుశ్యంత్ దావే, మీనాక్షి ఆరోరాలను న్యాయ సలహాదారులుగా నియమించారు. సీనియర్ అడ్వకేట్లు వీ మోహన, జయ సాల్వే, అడ్వకేట్ అమోల్ చితలే కూడా ఈ కేసులో వాదించారు.

## రోడ్ల మరమ్మతుల పనుల్లో వేగం పెంచాలి : మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, మే1:ముఖ్యమంత్రి కేసీఆర్(అఓ ఐఅఖీ) ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో ఆర్ అండ్ బి రోడ్లు అద్దంలా తయారవుతున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి(ఓతినితిబబివతీ ఎవఎబీశ్రీజీ ఖతీజీబష్ట్రజీనిబిష్ట్ర ఖీవటటఎ) అన్నారు. సోమవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ఆర్ అండ్‌బీ ఉన్నతాధికారులతో నిర్వహించిన తొలి సమీక్షలో(ఖీవలతివలి) మాట్లాడారు.

రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల వల్ల డ్యామేజ్ అయిన 1172 పీరియాడికల్ రెన్యువల్ రోడ్ల మరమ్మతుల(ఖీనీజీట తీవజూజీతితీబ) పనుల కోసం రూ. 2858 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ రోడ్ల మరమ్మతులపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి కావాలని సూచించారు. ఇప్పటికే 518 కోట్లతో 1393 కి. మి పొడవు గల రోడ్ల మరమ్మతులు పూర్తి చేశామని,రూ. 1,223 కోట్ల విలువగల 455 రోడ్ వర్క్స్ మొత్తం 2,700 కి. వచ్చే 45 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతులు పనులు 60 వర్క్ ఏజెన్సీ(చినీతీఎ ఒణవనిఇ·తివబ)లు పని చేస్తున్నాయని, ప్రతీ ఏజన్సీతో క్షేత్ర స్థాయిలో సమీక్షించి నిర్ణీత గడువులోగా ప్రణాళిక ప్రకారం పూర్తి అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రతీవారం తానే స్వయంగా రోడ్ల వర్క్ ప్రోగ్రెస్ పరిశీలిస్తానని వెల్లడించారు. ఈ సమీక్షలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్,తాండూర్ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఆర్ అండ్ బి సెక్రెటరీ శ్రీనివాస రాజు,ఈఎన్సీ రవీందర్ రావు, డీసీ దివాకర్, ఎస్.ఈ వసంత్ నాయక్ ఇతర ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

## వానాకాలంలో కోటి 40 లక్షల ఎకరాల్లో సాగు : మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, మే1:రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయంలో వ్యవసాయ శాఖపై తొలి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ విలువైనా సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

ఈ వానాకాలంలో కోటి 40 లక్షల ఎకరాలలో సాగు అంచనా వేస్తున్నామన్నారు. మరో 14 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటల సాగుకు అవకాశముందని వెల్లడించారు. అందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ సమాయత్తం కావాలని సూచించారు. సేంద్రీయ సాగు, భూసారాన్ని దృష్టిలో ఉంచుకుని పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి రూ.76.66 కోట్లు నిధుల విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ అవసరాలలో డ్రోన్ వినియోగంపై యువతకు అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటల సాగుకై డీసీసీబీల ద్వారా ఎకరానికి రూ.40 వేలు వరకు పంటరుణాలు అందించాలని చెప్పారు.బాన్సువాడ, బోధన్, హుజూర్ నగర్, మిర్యాలగూడల మాదిరిగా వరి సాగు సీజన్ ముందుకు జరపాలని అధికారులకు మంత్రి వివరించారు.మార్చి చివరి వరకు యాసంగి కోతలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటే వడగళ్ల వానల నుంచి నష్టాన్ని నివారించవచ్చని సూచించారు.తక్కువ కాలంలో అధిక దిగుబడులు ఇచ్చే నూతన వరి వంగడాలను రైతులకు అందేలా చూడాలన్నారు.నకిలీ విత్తన పంపిణీ దారులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కొండబాల కోటేశ్వర్ రావు, మార గంగారెడ్డి, కొండూరు రవీందర్ రావు, సాయిచంద్, తిప్పన విజయసింహారెడ్డి, మచ్చా శ్రీనివాస్ రావు, రాజావరప్రసాద్ రావు, రామకృష్ణారెడ్డి, ఉద్యానశాఖ డైరెక్టర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి రథాలకు ఇంధన శక్తి శ్రామికులే...!

## ( 'అంతర్జాతీయ కార్మిక దినోత్సవం' సందర్భంగా)

ప్రాచీన కాలంలో కార్మిక కర్షక లోకం వసంతోత్సవంగా నిర్వహించుకునే 'మే డే'ను 01 మే రోజున 'అంతర్జాతీయ కార్మిక దినం'గా లేదా 'కార్మిక దినం'గా పాటించిన ఆనవాయితీగా వస్తున్నది. 01 మే 1886న చికాగోలో 3 లక్షల కార్మికులతో జరిగిన శ్రామికలోకపు ప్రతిఘటన ఉద్యమం హింసాత్మకంగా మారడం, అనేక రోజులు కొనసాగడం జరిగింది. 04 మే 1886 రోజున 'హేమార్కెట్ అఫైర్స్' దుర్ఘటన (పోలీస్ కాల్పుల్లో 11 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోతారు) స్మారకార్థం 'మే డే' నిర్వహించుట జరుగుతున్నది. 1889లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ మార్క్సిస్ట్ సోషలిస్ట్ కాంగ్రెస్ తీర్మానం ప్రకారం కార్మిక దినం నిర్వహించుటకు నిర్ణయించారు. కార్మిక ఉద్యమ ఫలితంగా రోజుకు 12 – 16 గంటల పనికి బదులుగా 8 గంటలు మాత్రమే ఉండాలనే నియమం అమలులోకి వచ్చింది. అమెరికా, జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లాండ్ దేశాల్లో ప్రారంభమైన మే డే ఉత్సవాలు నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు అనుసరించుట జరిగింది. ప్రతి ఏటా రష్యాలోని మాస్కో రెడ్ స్క్వేర్ కూడలిలో మే డే ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయి.

తొలి ఎర్ర జెండా ఎగిరేసిన మే డే:

భారతదేశంలోని మద్రాస్‌లో 'సింగరవెలార్' నాయకత్వంలో 'హిందుస్థాన్ లేబర్ కిసాన్ పార్టీ' ఆధ్వర్యంలో 01 మే 1923న తొలి సారి ఎర్ర జెండా ఎగరేసి 'మే డే' నిర్వహించారు. ఇండియాలో 01 మే రోజున ప్రభుత్వ సెలవు దినంగా మే డే నిర్వహించుట జరుగుతున్నది. మన దేశంలో మే డే రోజున కార్మిక శ్రామిక వర్గాల సభలు, సమావేశాలు, ఎర్ర జెండాలు చేతబూని కార్మికపు హక్కుల కోసం ర్యాలీలు నిర్వహిస్తూ, అమూల్య సేవలు అందించిన కార్మికులను సన్మానించడం, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన కార్మికులకు నివాళులు అర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. మన దేశంలో 'మే డే' ఉత్సవాలను హిందీలో 'కామ్గర్ దిన్' లేదా 'శ్రామిక్ దివస్', మరాఠీలో 'కామ్గర్ దివస్', తమిళంలో 'ఉజైపలార్ దినం'గా నిర్వహిస్తారు. 01 మే 1960 రోజున బొంబాయ్ రాష్ట్రం భాషా ప్రాతిపదికగా విభజింపబడి మహారాష్ట్ర, గుజరాత్‌లు ఏర్పడ్డాయి. దీనికి గుర్తుగా 01 మే రోజున 'మహారాష్ట్ర డే', 'గుజరాత్ డే'లను ఘనంగా నిర్వహిస్తారు.

ప్రపంచ కార్మిక వేదిక మే డే:

ప్రపంచదేశాలన్నీ మే డే ఉత్సవాలను వేరు వేరు రోజుల్లో ఘనంగా తమదైన రీతిలో నిర్వహిస్తుంటాయి. వివిధ దేశాలు 'మే డే' ఉత్సవాలను విలక్షణంగా, వైవిధ్య భరితంగా నిర్వహిస్తారు. కొన్ని ప్రాంతాల్లో మే డే రోజు ఉదయం కురిసే మంచుతో ముఖం కడుక్కవడం జరుగుతుంది. బ్రిటన్‌లో వసంత రుతు ఆగమన ఉత్సవంగా మే డే జరుపుకుంటారు. మే డే రోజు ఉదయం వేళలో పిల్లలను పాదరక్షలు లేకుండా నడిపించడం అనే సాంప్రదాయం కూడా ఉన్నది. చెట్ల కొమ్మలకు పలు వర్ణాల రిబ్బన్స్, పుష్పాలను అలంకరిస్తారు. కొన్ని దేశాల్లో టర్నిప్ మె?క్కలను నాటడం, చేపలు పట్టడం, తేనెటీగల పెంపకం దారులు తేనెటీగలను కదిలిస్తారు.

దేశ ప్రగతి రథ చక్రాలు:

శ్రామిక లోకం కండలు పిండి చేస్తేనే, మనందరికీ ఆధునిక జీవితం సులభతరం అవుతున్నదని మరువరాదు. గత రెండు ఏండ్లుగా ప్రపంచవ్యాప్తంగా కమ్మిన కరోనా చీకట్లలో అన్ని వర్గాల ప్రజలు నలుగుతూనే ఉన్నారు. లాక్‌డౌన్, కర్ఫ్యూ, పలు ఆంక్షల నడుమ బడుగులు, శ్రామికవర్గాలు, కార్మిక సమాజపు పూట గడవడం గగనం అయ్యింది. మహానగరాల్లోని వలసదారులు తమ పాదాలను మండు వేసవి నిప్పుల మీద మోపుతూ తమ ఊళ్ళకు కన్నీళ్లను దిగమింగుతూ పయనం కావడం, నరకయాతన పడడం మనమింకా మరిచి పోలేదు. కార్మిక కర్షక శ్రామిక లోకం పని దొరక్క, కరోనా క్రమశిక్షణ పాటిస్తూ కుటుంబాలను పోషించడం కష్టం అయ్యింది. కోవిడ్–19 దుష్ప్రభావం అన్ని వర్గాల ప్రజలపై పడినప్పటికీ కార్మిక శ్రామిక లోకపు ధీనులపై అధికంగా పడింది.

పరి'శ్రమ'లోనే శ్రమ ఉంది:

ప్రపంచంలో ఏ మూలన ఏ దుర్ఘటన జరిగినా తొలి దెబ్బ మాత్రం పేద బడుగు బలహీన వర్గాల బతుకుల మీద మాత్రమే పడడం జరుతున్నది. కార్మికులు లేనిదే ప్రగతిరథం సాగదు, పరిశ్రమలు కదలవు. పరి'శ్రమ'లోనే శ్రామికుడి 'శ్రమ' దాగి ఉన్నది. దేశ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధి మె?త్తం కార్మికుల కండరాల మీదనే ఆధారపడి ఉంటుంది. శ్రామిక వర్గాలే వ్యవసాయ, పారిశ్రామిక పురోగతికి పునాదులుగా నిలబడి చేమటోడ్చుతారు. శ్రామికలోకం చల్లగా ఉంటేనే సమాజం సర్వతోముఖాభివృద్ధి చెందినట్లుగా ప్రమాణీకరించాలి. దేశ ప్రతిరథానికి కార్మికులే చక్రాలు, శ్రామికుల చెమట చుక్కలే ఇంధనాలుగా నిలుస్తున్నాయి. దేశాభివృద్ధిలో కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల కృషి అనన్యసామాన్యం. కార్మిక, కార్షక, శ్రామిక లోకాన్ని కళ్ళల్లో పెట్టుకొని చూసుకుంటూ, వారి కళ్ళల్లో ఆనంద భాష్పాలను ఆవిష్కరిద్దాం.



డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# లండన్ సైన్స్ మ్యూజియం సందర్శించి టీకా కార్యక్రమంలో భారత్ సాధించిన విజయాలు వివరించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మే1:175 సంవత్సరాల పురాతన లండన్ సైన్స్ మ్యూజియం ను కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ శాస్త్రం, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్, అణుశాస్త్రం, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు సందర్శించారు. భారతదేశంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో లండన్ సైన్స్ మ్యూజియం తరహాలో సైన్స్ మ్యూజియంల ఏర్పాటు కోసం జరుగుతున్న ప్రయత్నాలను డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు.

ప్రజలు, ముఖ్యంగా యువత తమలో దాగి ఉన్న సామర్థ్యాన్ని గుర్తించడానికి సైన్స్ మ్యూజియంలు ఉపయోగపడతాయన్నారు. సైన్స్ మ్యూజియం సందర్శించిన తర్వాత కొన్నిసార్లు వారికే తెలియని వారి నిగూఢ సామర్థ్యాన్ని కూడా ప్రజలు గుర్తిస్తారన్నారు. సామర్థ్యాలను గుర్తించడంతోపాటు సైన్స్ పట్ల వారికి ఉత్సుకత కలుగుతుందన్నారు. ఉత్సుకత వల్ల శాస్త్రీయ పరిజ్ఞానం పట్ల ఆసక్తి పెరిగి సృజనాత్మక ఆవిష్కరణలకు దారితీస్తాయని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

లండన్‌లోని సౌత్ కెన్సింగ్టన్‌లోని ఎగ్జిబిషన్ రోడ్ లో లండన్ సైన్స్ మ్యూజియం 1857లో ఏర్పాటయింది. కోవిడ్ సమయంలో భారతదేశం అనుసరించిన విధానం, అమలు చేసిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను మ్యూజియం నిర్వాహకులు ప్రశంసించారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ తన పర్యటనలో ఇంధనం, టీకాలు, అంతరిక్ష అంశాలపై ఏర్పాటైన ప్రాంతాలపై దృష్టి సారించారు.

కోవిడ్ పై ఏర్పాటు చేసిన ప్రత్యేక పెవిలియన్ వివరాలను మ్యూజియం నిర్వాహకుల నుంచి మంత్రి తెలుసుకున్నారు. కోవిడ్ సంబంధించిన వివిధ అంశాలపై పెవిలియన్ ఏర్పాటయింది. కోవిడ్ చరిత్ర, కోవిడ్ సోకిన మొదటి వ్యక్తి వివరాలు తదితర అంశాలను దీనిలో ఏర్పాటు చేశారు. కోవిడ్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో కోవిడ్ పెవిలియన్ ఏర్పాటయింది. కోవిడ్ నిర్వహణ, నివారణ కోసం భారతదేశం అమలు చేసిన కార్యక్రమాల వివరాలను పెవిలియన్ లో పొందుపరిచిన నిర్వాహకులు భారతదేశం సాధించిన విజయాలను గుర్తించి గౌరవించారు.

భారత ఉపఖండంలో ప్రబలంగా ఉన్న ఉష్ణమండల వ్యాధుల వివరాలు వివరిస్తూ ఏర్పాటైన మరో పెవిలియన్ ను డాక్టర్ జితేంద్ర సింగ్ సందర్శించారు. పోలియో నిర్మూలన కోసం భారతదేశంలో అమలు జరుగుతున్న కార్యక్రమం వివరాలు పెవిలియన్ లో ఏర్పాటు అయ్యాయి. దీనిలో హిందీ భాషలో వ్రాసిన బ్యానర్‌లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం మంత్రిని ఆకట్టుకుంది. పోలియో నివారణ, ఆరోగ్య సంరక్షణ రంగంలో భారతదేశం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచింది అని లండన్ సైన్స్ మ్యూజియం పేర్కొంది.

ప్రపంచంలో ప్రధాన బయో–ఆర్థిక వ్యవస్థగా భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా, ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. కేవలం రెండేళ్లలో భారత్ నాలుగు స్వదేశీ వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసిందని ఆయన వెల్లడించారు.

శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖలోని బయోటెక్నాలజీ విభాగం (ఆఖ) "మిషన్ కోవిడ్ సురక్ష" ద్వారా నాలుగు వ్యాక్సిన్‌లను పంపిణీ చేసిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. కోవాక్సిన్ ఉత్పత్తిని ఎక్కువ చేసిన బయోటెక్నాలజీ విభాగం భవిష్యత్తులో వ్యాక్సిన్‌ల సజావుగా అభివృద్ధి చెందడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సృష్టించిందని మంత్రి తెలిపారు. ఎటువంటి విపత్తును అయినా ఎదుర్కోవడానికి భారతదేశం సిద్ధంగా ఉందని మంత్రి ప్రకటించారు.

వ్యాధులను నివారించడానికి భారతదేశం అమలు చేస్తున్న ఆరోగ్య సంరక్షణ విధానం అత్యుత్తమ సామర్థ్యాలను ప్రపంచ దేశాలు గుర్తించాయని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా అనేక ఇతర వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసే ప్రక్రియపై భారతదేశం దృష్టి సారించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఇటీవల మొదటి డిఎన్ఏ వ్యాక్సిన్ భారతదేశంలో రూపుదిద్దుకుందని తెలిపిన డాక్టర్ జితేంద్ర సింగ్ ముక్కు ద్వారా తీసుకునే విధంగా అభివృద్ధి చేసిన వ్యాక్సిన్ కూడా విజయవంతం అయ్యిందన్నారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు సహాయపడే హ్యూమన్ పాపిల్లోమావైరస్ (ఊఖఎ) వ్యాక్సిన్ ను కూడా భారతదేశం అభివృద్ధి చేసిందని వెల్లడించారు.

ప్రపంచ స్థాయిలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకున్న భారత వ్యాక్సిన్ మార్కెట్ 2025 నాటికి రూ. 252 బిలియన్లకు చేరుకుంటుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. బయోటెక్ స్టార్టప్‌లు వ్యాక్సిన్ అభివృద్ధి విస్తృత సహకారం భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్ ల మధ్య మరింత సహకారం అవసరమన్నారు. డాక్టర్ జితేంద్ర సింగ్ నాయకత్వంలో ఆరు రోజుల పాటు యునైటెడ్ కింగ్‌డమ్‌లో శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ కు చెందిన ఉన్నత–స్థాయి భారతీయ ప్రతినిధి బృందం పర్యటిస్తుంది.

# ఆకాంక్షలు నెరవేర్చే ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం

### –టీడీపీ యువ నాయకుడు నారా లోకేష్

ఎమ్మిగనూరు మే1: (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఏపీలో ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆంక్షలతో పాలన చేస్తోందని.. ఎవరు బయటకు రావాలి.. ఎవరు రాకూడదు.. ఎవరికి స్వేచ్ఛ ఉండాలి.. ఎవరికి ఉండకూడదో కూడా నిర్ణయిస్తోందని.. టీడీపీ యువ నాయకుడు నారా లోకేష్ మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆంక్షలు కాదు.. ఆకాంక్షలు నెరవేర్చే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం యువగళం పాదయాత్రలో ఉన్న నారా లోకేష్.. ఎమ్మిగనూరులో జోరు వానలోనూ.. యాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మున్సిపాలిటీలు పంచాయితీలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించిన జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కొత్తగా పెన్షన్లు ఇవ్వడం చేతగాక కుంటిసాకులతో ఉన్న పెన్షన్లు తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6లక్షల పెన్షన్లను వైసీపీ ప్రభుత్వం తొలగించిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక అర్హులైనవారికి ఆంక్షలు లేకుండా పెన్షన్లు అందిసామన్నా టరు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం పాడుబెడుతోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. రకరకాల పన్నులతో జగన్ రెడ్డి పట్టణ వాసుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే పన్నుల విధానాన్ని సమీక్షించి సామాన్యులపై భారం తగ్గిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఇవన్నీ ఆంక్షలు కావా? అని నారా లోకేష్ ప్రశ్నించారు. తమ హయాంలో ఇలాంటి ఆంక్షలు లేవన్నారు. ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించే పరిస్థితి ప్రస్తుత వైసీపీ హయాంలో లేకుండా పోయిందని.. భయ పడుతూ బతుకుతున్నారని అన్నారు. టీడీపీ హయాంలో అందరూ స్వేచ్ఛగా జీవించారని.. తిరిగి అలాంటి ప్రభుత్వం వస్తుందని పేర్కొన్నారు.

# ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రాచుర్యం పొందిన రేడియో కార్యక్రమం మన్ కీ బాత్

న్యూఢిల్లీ, మే1:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రాచుర్యం పొందిన రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ కు సంకేతంగా హర్యానా, భివానీలోని దుల్హేడీ గ్రామంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కెవిఐసి) ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని మన్ కీ బాత్ 98వ ఎపిసోడ్‌లో భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పిఎంఇజిపి) గురించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు, దానితో పాటుగా స్వచ్ఛత కీ సిపాయిలను సత్కరించేందుకు నిర్వహించారు.

ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ పిఎంఇజిపి అవగాహనా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ఖాదీ స్వయం సమృద్ధిని సాధించేలా చేయడంలో ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమం ప్రముఖ పాత్ర పోషించిందని అభిప్రాయపడ్డారు. యువత కేవలం ఉపాధిని కోరేవారిగా కాక ఉపాధినిచ్చేవారిగా, ఇతర యువతకు స్ఫూర్తిగా ఉండేలా చేయడం గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీజీ దార్శనికత అని ఆయన అన్నారు. ఈ అవగాహనా శిబిరంలో సమీప గ్రామాలకు చెందిన రెండువేల మంది ప్రజలు పాల్గొన్నారు.

ఇటీవలే తన మన్ కీ బాత్ 98వ ఎపిసోడ్‌లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ హర్యానాలోని దుల్హేడీ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య సిపాయిలను ప్రస్తావించి, ప్రశంసించారు. దుల్హేడీ గ్రామానికి చెందిన యువత యువ స్వచ్ఛత ఏవం జన సేవా సమితి పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి, నగరంలోని భిన్న ప్రాంతాల నుంచి టన్నుల కొద్దీ చెత్తను తొలగించారు.

దుల్హేడీ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య సిపాయిలు అందరినీ శ్రీ మనోజ్‌కుమార్ అభినందిస్తూ, వారి ప్రాంతంలోని యువతను గరిష్ట సంఖ్యలో పిఎంఇజిపికి అనుసంధానం చేసి ఉపాధి కల్పనకు దోహదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

పిఎంఇజిపి గురించి అవగాహనను కల్పించడంలో, యువతను స్వావలంబన సాధించే దిశగా ప్రేరణను ఇవ్వడం, సమాజాభివృద్ధికి దోహదం చేయడంలో అత్యంత విజయవంతమైన ఈ కార్యక్రమానికి హర్యానా ప్రభుత్వ, బ్యాంకు ప్రతినిధులతో పాటుగా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్‌కు చెందిన ఉద్యోగులు అధికారులు హాజరయ్యారు.

# కార్మికులు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి.. కలెక్టర్



మహబూబ్ నగర్, మే1:కార్మికులు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ కోరారు. మేడే సందర్భంగా సోమవారం భవన నిర్మాణ కార్మికుల కు 54 రకాల వైద్య పరీక్షల శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ? కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్సీ హెల్త్ కేర్ జిల్లా కోఆర్డినేటర్ సూగురు భాస్కర్, జిల్లా కార్మిక శాఖ అధికారి అబ్దుల్ షర్ఫుద్దీన్, జిల్లా పౌర సమాచార శాఖ అధికారి సీతారాం నాయక్, క్యాంప్ కోఆర్డినేటర్ అజయ్ కుమార్, వైద్యులు డాక్టర్ స్వర్ణ విజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మాజిపేట లక్ష్మీనారాయణ, ఎలక్ట్రిషన్ అధ్యక్షులు మాదాసి రఘు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జియాగూడ నల్లపోచమ్మ, తుల్జాభవాని ఆలయ వార్షికోత్సవాలు



హైదరాబాద్ మే1: (ఎక్స్ ప్రెస్ న్యూ స్);జియాగూడ సంజయ్ నగర్ లోని చారిత్రక నల్లపోచమ్మ, తుల్జాభవాని, సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఆలయ ధర్మకర్తలు రావుల శ్రీనివాస్ రావు, వంశీ నేతృత్వంలో గణపతి పూజ, మండపారాధన, దుర్గాహోమాలు, జయాది హోమాలు, నీరాజన మంత్రపుష్పములు, విశేష అభిషేకం, మండప పూజ, మహాపూర్ణాహుతి, కలశోద్యాసన, కుంభాభిషేకం, బలిహరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

# తెలంగాణ సమాజం ఇప్పుడు మార్పు కోరుతోంది

### –ప్రస్తుతం జరిగిన సర్వేలన్నీ కూడా.. బీజేపీకి అనుకూలంగా ఉన్నాయి
### –తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ మే1: (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సమాజం ఇప్పుడు మార్పు కోరుతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అధికారం అప్పగించేందుకు ప్రజలు రెడీగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం జరిగిన సర్వేలన్నీ కూడా.. బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. నవంబరు–డిసెంబరు మధ్య జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధిస్తామని బండి సంజయ్ తెలిపారు. ప్రధాని మోడీ మన్ కీ బాత్ కార్యక్రమం 100వ ఎపిసోడ్ బంజారాహిల్స్లో ప్రసారం చేశారు. దీనికి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ వందసార్లు రేడియో ద్వారా మనందరితో మాట్లాడిన గొప్ప వ్యక్తి అని తెలియజేశారు. ఇంత వరకు ఏ ప్రధాని.. మోడీ తరహాలో చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఎపిసోడ్లో ఏదో ఒక సమస్యపై ప్రజలతో చర్చించారని తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న సమస్యలపై ప్రధాని మాట్లాడారని చెప్పారు. మోడీ దేశంలో ఇన్ని గొప్ప పనులు చేస్తున్నా.. కొంత మంది రాజకీయ నాయకులు వారి స్వార్థం కోసం విమర్శిస్తున్నారని కేసీఆర్పై పరోక్షంగా బండి మండిపడ్డారు. ప్రధాని మాత్రం ఈ కార్యక్రమాన్ని రాజకీయం కోసం కాకుండా ప్రజల కోసం వినియోగించారని.. ఇందులో ఎటువంటి రాజకీయ కోణాలు తీసుకురాలేదని స్పష్టం చేశారు. మన్ కీ బాత్ ద్వారా ప్రజలను జాగృతం చేసి.. చైతన్యవంతులను చేశారని హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు అంటే కేసీఆర్ పట్టించుకోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు నూతన సచివాలయం.. సచివాలయం మాదిరిగా కనిపించనందునే ప్రారంభోత్సవానికి వెళ్లలేదన్నారు. సర్వేలన్నీ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని చెబుతున్నాయని వెల్లడించారు. సర్వేలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని.. కచ్చితంగా విజయం సాధిస్తామని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

# కష్టజీవులను కలుస్తూ..కష్టాలను తెలుసుకుంటూ. కొనసాగుతున్న భట్టి పీపుల్స్ మార్చ్



నల్గొండ, మే1: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగడుతూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నిర్వహిస్తున్నపీపుల్స్ మార్చ్ పాదయాత్ర యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు మీదుగా కొలనుపాక కు కొనసాగుతుంది. కష్టజీవుల కలుస్తూ.. వారి కష్టాలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

పాదయాత్రలో భాగంగా ఆలేరునుంచి బయలుదేరిన భట్టి విక్రమార్క వద్దకు టైర్ పంక్చర్ వేసుకునే సామా రమేష్ కలసి తమ కష్టాలను చెప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మాకు అన్నీ సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పుడు ఏమీ అందడం లేదని వాపోయారు. జీవించడం కూడా చాలా కష్టంగా ఉందని రోదిస్తూ తెలిపారు. వచ్చే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అందరికీ మేలు జరుగుతుందని భట్టి హామీ ఇచ్చారు. అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు యాత్రలో పాల్గొన్నారు.

# మహిళా ప్రయాణికురాలి లగేజ్ బ్యాగుల్లో 22 పాములు



చెన్నై మే1: మ(ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఒక మహిళా ప్రయాణికురాలి లగేజ్ బ్యాగుల్లో 22 పాములు ఒక ఊసరవెల్లి ఉన్నాయి. వీటిని చూసి కస్టమ్స్ అధికారులు షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది తమిళనాడు రాజధాని చెన్నైలో ఈ సంఘటన జరిగింది. ఏప్రిల్ 28న ఒక మహిళ మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి ఏకే13 విమానంలో తమిళనాడు రాజధాని చెన్నై విమానాశ్రయానికి చేరుకుంది. ఆ మహిళపై అనుమానం రావడంతో కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె లగేజ్‌ను తనిఖీ చేశారు. ఆ మహిళకు చెందిన బ్యాగుల్లో పలు జాతులకు చెందిన 22 పాములు, ఒక ఊసరవెల్లి కనిపించాయి. వీటిని చూసి కస్టమ్స్ అధికారులు ఖంగు తిన్నారు. పాములు పట్టే వారిని రప్పించి ఆ పాములను స్వాధీనం చేసుకున్నారు.కాగా, ఆ మహిళపై కస్టమ్స్ యాక్ట్‌తోపాటు వన్యప్రాణుల రక్షణ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన ఆ మహిళను స్థానిక కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులు కస్టడీ విధించడంతో రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. ఆ పాములు, ఊసరవెల్లిని అక్రమంగా ఎవరికి రవాణా చేస్తున్నారో అన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఆ మహిళ బ్యాగుల నుంచి బయటపడిన పాముల వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వీడియో చూసి నెటిజన్లు కూడా షాక్ అయ్యారు.

# శ్రీవారి ఆశీస్సులతో గంగమ్మతల్లి జాతర బ్రహ్మోత్సవాలు : భూమన



తిరుపతి, మే1: తిరుమల శ్రీవారి ఆశీస్సులతో అంగరంగ వైభగంగా, ఎవరూ వూహించని విధంగా శ్రీవారి చెల్లెలు గంగమ్మతల్లి జాతర బ్రహ్మోత్సవాల నిర్వహణ ఉంటుందని స్థానిక శాసన సభ్యులు భూమన కరుణాకర రెడ్డి అన్నారు. సోమవారం తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయ పున: ప్రతిష్ట శ్రీకారం మహా కుంభాభిషేకం కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు, మేయర్ డాక్టర్.శిరీషా, ఉప మేయర్ భూమన అభినయ రెడ్డి మహా కుంభాభిషేకం సందర్భంగా మొదటి రోజు పాల్గొన్నారు. అందరూ కుటుంబ సమేతంగా వచ్చి మహా కుంభాభిషేకంకు సంబంధించిన ప్రధాన కలశం మహాకాళి మహాలక్ష్మి మహా సరస్వతి దేవత ఆవాహనం, స్వర్ణ యంత్రమును వారి చేతుల మీదుగా ఆలయ ప్రదర్శనం నిర్వహణతో 70మంది వేద పండితులచే ఈ మహా కుంభాభిషేకం కార్యక్రమం ప్రారంభించారు.

ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ? గత వేయి సంవత్సరాల క్రితం తిరుమల శ్రీవారి ప్రథమ శిష్యుడు అనంత ఆల్వార్ అమృత హస్తాలతో శ్రీవారి చెల్లెలు తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయ పున: ప్రతిష్ట జరిగిందని, నేడు మరోమారు వారి వంశస్థులు 22వ తరం కస్తూరి రంగన్, వేద పండితులు యాగ నిర్వహణకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ ఏడాది ఈ మాసంలో 9వ తేది నుండి 16వ తేదీ వరకు జరిగే తాతయ్య గుంట గంగమ్మ తల్లి జాతర బ్రహ్మోత్సవాలు శ్రీవారి ఆశీస్సులతో అంగరంగ వైభవంగా నిర్వహించ నున్నామన్నారు. అనంతరం గంగమ్మ తల్లి జాతర బ్రహ్మోత్సవాల ప్రాముఖ్యత తెలిపే ప్రచార వాహనాలను ప్రారంభించారు. దేశంలోనే మొదటి గ్రామ దేవత తాతయ్య గుంట గంగమ్మ తల్లి వైభవాన్ని జగమంతా చాటుదామన్నారు. క్రెడాయ్, తిరుపతి చైర్మన్ శ్రీనివాసులు, ప్రెసిడెంట్ రామప్రసాద్, ట్రెజరర్, సభ్యులు కలసి గంగమ్మ జాతర నిర్వహణకు తమవంతుగా రూ.10 లక్షల చెక్కును స్థానిక శాసన సభ్యులు అందించారు. ఆలయ ఛైర్మన్ కట్టా గోపి యాదవ్, ఆలయ కార్యనిర్వహణాధికారి యం.ముని కృష్ణయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు టి.వెంకటేశ్వరరావు, టి.రమణమ్మ, పి.ధన శేఖర్, వి.కృష్ణమ్మ, యం.భారతి, ఆలయ అర్చకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భోగాపురానికి గ్రీన్ సిగ్నల్.. 3న సీఎం జగన్ ఉత్తరాంధ్ర పర్యటన

అమరావతి, మే1:భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. అటవీ, పర్యావరణ అనుమతులతో పాటు భూ సేకరణలో ఎదురైన అవాంతరాలను అధిగమించడంతో ఈనెల 3వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈనెల 3వ తేదీన సీఎం జగన్ ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ మిగులు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అదేరోజు విశాఖపట్నం- మధురవాడలో వైజాగ్ ఐటీ టెక్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తారు.

ఇందులో భాగంగా 3వ తేదీ ఉదయం 8 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10 గంటలకు భోగాపురం మండలం ఎ.రావివలస గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 10.25 గంటలకు జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు చేరుకుంటారు, ఆ సెంటర్‌ను సందర్శిస్తారు, భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి శంకుస్థాపన చేస్తారు. 10.30 గంటలకు భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ మిగులు పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. 10.55 గంటలకు సవరవిల్లి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభ వేదిక వద్దకు చేరుకుంటారు.

సభ అనంతరం 1.20 గంటలకు అక్కడి నుంచి విశాఖ బయలుదేరతారు. మధ్యాహ్నం 1.40 గంటలకు విశాఖ మధురవాడ ఐటీ హిల్స్ నెంబర్ 3 వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో బయలుదేరి ఐటీ హిల్స్ నెంబర్ 4లో గల వేదిక వద్దకు 2 గంటలకు చేరుకుంటారు. 2.30- 3.00 వైజాగ్ ఐటీ టెక్ పార్క్ శంకు స్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో నిర్వహించే కార్యక్రమంలో సీఎం ప్రసంగిస్తారు.తర్వాత 3.50 గంటలకు అక్కడినుంచి బయలుదేరి రుషికొండలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నివాసానికి చేరుకుంటారు. అక్కడ ఇటీ-వల వివాహం చేసుకున్న ఎంపీ కుమారుడు దంపతులను ఆశీర్వది స్తారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు మధురవాడ హెలిప్యాడ్ నుంచి బయలుదేరి, 5.20 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకు ంటారు. సాయంత్రం 5.30 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 6.45 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# కాశీ ఘాట్లలో గంగా పుష్కర వేడుకలు గంగా-గోదావరి నదుల సంగమం వంటిదే

న్యూఢిల్లీ, మే1:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ ఉత్తరప్రదేశ్‌లోని కాశీ నగరంలో నిర్వహించిన 'కాశీ తెలుగు సంగమం' కార్యక్రమంలో వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. గంగా పుష్కర వేడుకల నేపథ్యంలో ముందుగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపి, ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ఆహ్వానం పలుకుతూ ఆయన తన ప్రసంగం ప్రారంభించారు. ఈ వేళ కాశీ నగరంలో ఈ కార్యక్రమానికి హాజరైన వారంతా తన వ్యక్తిగత అతిథులేనని ఆయన అభివర్ణించారు. అలాగే మన భారతీయ సంస్కృతిలో అతిథులు దేవుడితో సమానమని ప్రధాని గుర్తుచేశారు. "ఉమ్మడిగా నేను స్వయంగా స్వాగతించలేకపోయినా, నా మనస్సు మీతోనే ఉంది" అని ఈ సందర్భంగా తన మనోభావాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కాశీ-తెలుగు కమిటీతో పాటు పార్లమెంటు సభ్యుడు శ్రీ జి.వి.ఎల్. నరసింహారావును ప్రధాని అభినందించారు. కాశీ ఘాట్‌ల వద్ద గంగా పుష్కర వేడుకలు గంగా-గోదావరి నదుల సంగమం వంటిదని పేర్కొన్నారు. ఇది భారత ప్రాచీన నాగరికత-సంస్కృతులు- సంప్రదాయాల మేలు కలయికకు సంబంధించిన వేడుకని ప్రధానమంత్రి చెప్పారు. కొన్ని నెలల కిందట ఇక్కడే కాశీ-తమిళ సంగమం నిర్వహణను ఆయన గుర్తుచేసుకున్నారు. అలాగే కొన్ని రోజుల ముందు సౌరాష్ట్ర - తమిళ సంగమంలో తాను పాల్గొన్నదాన్ని కూడా ప్రస్తావించారు. ఈ మేరకు స్వాతంత్ర్య అమృత కాలంలో దేశంలోని వైవిధ్యాలు-సంస్కృతుల సంగమంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. "ఈ భిన్నత్వాల సంగమం జాతీయవాద అమృతాన్ని సృష్టిస్తోంది. భవిష్యత్తులో ఇది భారతదేశానికి సంపూర్ణ శక్తిమంతం చేస్తుంది" అని ప్రధానమంత్రి ఆకాంక్షను వెలిబుచ్చారు.

కాశీకి తెలుగు ప్రజలతోగల ప్రగాఢ సంబంధాన్ని ప్రస్తావిస్తూ- తరతరాలుగా వారిని కాశీ స్వాగతిస్తున్నదని, ఈ నగరం ఎంత పురాతనమైనదో, ఈ బంధం కూడా అంత ప్రాచీనమైనదని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. కాశీలోని తెలుగు నేపథ్యంగల ప్రజల విశ్వాసం కాశీ నగరమంత పవిత్రమైనదని ఆయన అభివర్ణించారు. కాశీ యాత్రికుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు గణనీయ సంఖ్యలో ఉంటారని ప్రధాని పేర్కొన్నారు. అలాగే "తెలుగు రాష్ట్రాలు కాశీ నగరానికి ఎందరో గొప్ప రుషులను, యోగులను, ఆచార్యులను అందించాయి" అని ఆయన చెప్పారు. కాశీ ప్రజలు, యాత్రికులు విశ్వనాథ స్వామిని దర్శించుకోవడంతోపాటు తైలాంగ్ స్వామి ఆశ్రమాన్ని కూడా సందర్శించి ఆశీస్సులు పొందుతారని ప్రధానమంత్రి చెప్పారు. తైలాంగ్ స్వామి గురించి ప్రస్తావిస్తూ- ఆయన విజయనగరంలో జన్మించారని ప్రధాని గుర్తుచేశారు. అయితే, స్వామి రామకృష్ణ పరమహంస ఆయనను కాశీలో సాక్షాత్తూ శివ స్వరూపుడుగా అభివర్ణించారని పేర్కొన్నారు. కాశీలో ఈనాటికీ జిడ్డు కృష్ణమూర్తి వంటి మహానుభావులను ప్రజలు తలచుకుంటూంటారని ఆయన గుర్తుచేశారు.

ఈ నగరం తమను మమేకం చేసుకున్న తరహాలోనే తెలుగు ప్రజలు కూడా కాశీని తమ ఆత్మతో ముడివేసుకున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆ మేరకు తెలంగాణలోని పవిత్ర పుణ్యక్షేత్రం వేములవాడను దక్షిణ కాశీగా వ్యవహరించడాన్ని ఆయన గుర్తుచేశారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని ఆలయాల్లో చేతులకు కట్టే నల్ల దారాన్ని 'కాశీ దారం'గా పిలవడాన్ని ఆయన ప్రత్యేకంగా గుర్తుచేశారు. కాశీ తెలుగు భావ-సాహిత్యంలో లోతుగా పాతుకుపోయిన కాశీ వైభవాన్ని ఎత్తిచూపుతూ- శ్రీనాథ మహాకవి రచించిన 'కాశీ ఖండము' గ్రంథాన్ని, 'కాశీ యాత్ర'లో ఏంగుళ్ వీరాస్వామయ్య పాత్రను, ప్రసిద్ధ 'కాశీ మజిలీ కథల'ను ప్రధానమంత్రి ఉటంకించారు. ఈ నగరం దేశంలోని ప్రజల హృదయాలకు ఎంతో చేరువంటే నమ్మడం బయటి వ్యక్తులకు చాలా కష్టంగా ఉంటుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. అయితే- "ఒకే భారతం ? శ్రేష్ఠ భారతం" అనే నమ్మకాన్ని సజీవంగా ఉంచింది శతాబ్దాల భారత వారసత్వమే'' అని ప్రధాని వ్యాఖ్యానించారు.

"కాశీ నగరం జీవన్ముక్తి, మోక్ష ప్రదానం చేసే భూమి'' అని ప్రధానమంత్రి అన్నారు. ఒకనాడు కాశీ చేరాలంటే తెలుగు ప్రజలు వేల మైళ్లు నడిచి వచ్చేవారని గుర్తుచేశారు. కానీ, నేటి ఆధునిక యుగంలో పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయని ఆయన అన్నారు. ఈ మేరకు ఇటు విశ్వనాథ క్షేత్రం దివ్య వైభవం, అటు గంగా ఘాట్‌ల విస్తరణను ప్రధాని ఉదాహరించారు. అదేవిధంగా కాశీ నగర వీధులు ఒకవైపు విస్తరిస్తుండగా, మరోవైపు కొత్త రహదారులతో హైవేల నెట్‌వర్క్ పెరుగుతున్నదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఇంతకుముందు కాశీ నగరాన్ని సందర్శించిన వారు ఇప్పుడు ఇక్కడికి వచ్చినపుడు విశేష మార్పులను స్పష్టంగా గ్రహిస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. కొత్త జాతీయ రహదారి నిర్మాణంతో విమానాశ్రయం నుంచి దశాశ్వమేధ ఘాట్ వద్దకు చేరే సమయం తగ్గిపోవడం వారికి స్పష్టం తెలుస్తున్నదని చెప్పారు. నగరంలో అభివృద్ధిని వివరిస్తూ- చాలా ప్రాంతాల్లో విద్యుత్ తీగలను భూగర్భం నుంచి తీసుకురావడం, నగరంలోని కుండాలు, ఆలయ మార్గాలు, సాంస్కృతిక ప్రదేశాల పునరుజ్జీవనం, గంగానదిలో 'సిఎన్‌జి' పడవల వినియోగం వగైరాలను ప్రధాని ఉదాహరించారు. కాశీ పౌరులకు ప్రయోజనం చేకూర్చేలా నిర్మితమయ్యే రోప్‌వే గురించి కూడా ఆయన పేర్కొన్నారు. నగరంలో పరిశుభ్రత కార్యక్రమాలతోపాటు ఘాట్‌ల పరిశుభ్రత సాధించిన ఘనత నగరవాసులు, యువతకే దక్కుతుందని ప్రధానమంత్రి ప్రశంసించారు.

అతిథులను సాదరంగా స్వాగతించి, సేవలు చేయడంలో కాశీ నగరవాసులు ఎంతమాత్రం లోటు చేయరని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ''స్వామి ఆశీస్సులు.. కాలభైరవుడితోపాటు అన్నపూర్ణ మాత దర్శనం అద్భుతం. గంగా నదిలో పుణ్యస్నానంతో మీకు ఆత్మానందం తథ్యం" అని ప్రధాని వ్యాఖ్యానించారు. అదేవిధంగా 'లస్సీ, థండై, చాట్, లిట్టి-చోఖా, బనారసీ పాన్' వంటి రుచికరమైన వంటకాలు, పదార్థాలు కాశీ యాత్రను మరింత చిరస్మరణీయం చేస్తాయని పేర్కొన్నారు. స్వదేశీయులైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రవాసులు కాశీ యాత్ర నుంచి వెళ్లేటపుడు తీసుకెళ్లే వారణాసి కొయ్యబొమ్మలు, బనారస్ చీరలు వంటివి ఆ రాష్ట్రాల్లోని ఏటికొప్పాక బొమ్మలు వంటివేనని ప్రధానమంత్రి గుర్తుచేశారు.

"మన పూర్వికులు భారత చైతన్యాన్ని వివిధ కేంద్రాల్లో ప్రతిష్ఠించారు, ఇదంతా ఏకమైతే భరతమాత సంపూర్ణ స్వరూపం ఆవిష్కృతమవుతుంది'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. కాశీలో విశ్వనాథ స్వామి-విశాలాక్షి శక్తిపీఠం, ఆంధ్రాలో భ్రమరాంబ-మల్లికార్జున స్వామి, తెలంగాణలో రాజరాజేశ్వర స్వామి ఆలయం వంటి పవిత్ర స్థలాలన్నీ భారతదేశానికి ఎంతో ముఖ్యమైన విశ్వాస కేంద్రాలు మాత్రమేగాక సాంస్కృతిక గుర్తింపునకు ప్రతీకలని ఆయన అన్నారు. చివరగా- దేశ వైవిధ్యాన్ని పరిపూర్ణ రూపంలో దర్శిస్తేనే భారత పరిపూర్ణత-సంపూర్ణ సామర్థ్యాలను మనం గ్రహించగలమని ప్రధాని స్పష్టం చేశారు. "ఆ విధంగా చేయగలిగితేనే మనలోని పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయగలం" అని శ్రీ మోదీ అన్నారు. భారతీయులలో దేశసేవ సంకల్పాన్ని గంగా పుష్కరాల వంటి వేడుకలు మరింత ముందుకు తీసుకెళ్లగలవని విశ్వాసం వ్యక్తం చేస్తూ ఆయన తన ప్రసంగం ముగించారు.

# అమెరికాలో దివాళీ తీసిన ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకు

న్యూయార్క్ మే 1 : అమెరికాలో మరో బ్యాంకు దివాళీ తీసింది. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకును జేపీ మోర్గన్ సంస్థ టేకోవర్ చేసుకోనున్నది. ఈ విషయాన్ని ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ స్పష్టం చేసింది.

ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకుకు చెందిన అన్ని డిపాజిట్లు, అసెట్స్‌ను ఇక నుంచి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ జేపీ మోర్గన్ చూసుకోనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. ఇటీవల అమెరికాకు చెందిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంకులు దివాళా తీసిన విషయం తెలిసిందే. అయితే కొన్ని నెలల తేడాలోనే అమెరికాలో మూడవ బ్యాంకు మూతపడింది. శాన్ ఫ్రాన్సిస్‌కోకు చెందిన ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకు షేర్లు గత వారం 75 శాతం పడిపోయాయి. మార్చిలో కస్టమర్లు సుమారు 100 బిలియన్ల డాలర్లు విత్‌డ్రా చేసుకున్నట్లు ఆ బ్యాంకు వెల్లడించింది. బ్యాంకుల మూసివేతతో అమెరికా ఆర్థిక వ్యవస్థ అయోమయంలో పడింది. అయితే ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకువచ్చేందుకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఎమర్జెన్సీ చర్యలు చేపట్టింది. వాస్తవానికి అమెరికాకు చెందిన సుమారు 11 బ్యాంకులు మార్చి నెలలో ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకులోకి 30 బిలియన్ల డాలర్లు ట్రాన్స్‌ఫర్ చేశాయి. ఫస్ట్ రిపబ్లిక్‌ను స్థిరీకరించేందుకు ప్రయత్నం చేసినా.. ఎటువంటి లాభం జరగలేకపోయింది. 1985లో ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకును స్థాపించారు.

# జేబులు కొట్టే వాళ్లే రజనీకాంత్‌ను విమర్శిస్తున్నారు - సిపిఐ నారాయణ

హైదరాబాద్, మే1:సూపర్ స్టార్ రజనీకాంత్ పై వైసీపీ నేతల విమర్శలపై సీపీఐ నారాయణ కూడా ఘాటుగా స్పందించారు. వైసీపీ మంత్రులు రజనీపై చేస్తున్న విమర్శల్ని తప్పుబట్టారు. రజనీకాంత్ వైసీపీని ఒక్కమాట కూడా అనకపోయినా ఆయన్ను విమర్శించడమేంటని ప్రశ్నించారు. చంద్రబాబును పొగిడినంత మాత్రాన రజనీ వంటి నటుడిపై విమర్శలు చేస్తారా అని నిలదీశారు. జేబులు కొట్టే వాళ్లంతా రజనీకాంత్ ను విమర్శిస్తున్నారంటూ సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ కు నారాయణ తన మద్దతు ప్రకటించారు. ఇప్పటికే వైసీపీ నేతలు చేస్తున్న విమర్శల్ని తప్పుబడుతూ ట్విట్టర్ లో సైతం వైసీపీ అపాలగైజ్ టూ రజనీ అంటూ ట్రెండింగ్ అవుతున్న నేపథ్యంలో నారాయణ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కాగా, ఏపిలో ఇటీవల జరిగిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన సూపర్ స్టార్ రజనీకాంత్.. టీడీపీ అధినేత చంద్రబాబుపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన్ను జాతీయ, అంతర్జాతీయ నేత అంటూ ఆకాశానికెత్తేశారు. చంద్రబాబు గొప్పతనం గురించి ఏపీలో ఉన్న వారి కంటే బయట ఉన్న వారే ఎక్కువగా తెలుసంటూ వ్యాఖ్యానించారు. దీంతో వైసీపీ నేతలంతా రజనీపై ఎదురుదాడికి దిగారు. రజనీకాంత్ చంద్రబాబుకు మద్దతుగా మాట్లాడిన మాటలపై వెంటనే స్పందించిన వైసీపీ నేతలు రెండు రోజులుగా తీవ్ర విమర్శలకు దిగుతున్నారు. ముఖ్యంగా మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు రజనీని టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దీనిపై ఇవాళ చంద్రబాబు సైతం రంగంలోకి దిగి వారికి కౌంటర్ ఇచ్చారు. రజనీని విమర్శించడమంటే ఆకాశంపై ఉమ్మేసినట్లేనంటూ ఓ ట్వీట్ కూడా చేశారు

# ఏపి ప్రభుత్వ ఉద్యోగ సంఘ నేత సూర్యనారాయణకు హైకోర్టులో ఊరట..

అమరావతి, మే1: ఏపీలో ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిత్యం ఆందోళనలు చేపడుతున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు ఎదుర్కోనేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వానికి గత ఎన్నికల సమయంలో వైసీపీ ఇచ్చిన హామీల్ని గుర్తుచేస్తూ వాటిని అమలు చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో ఓ ఉద్యోగ సంఘం నేతపై ప్రభుత్వం గుర్రుగా ఉంది. ఇప్పటికే హైకోర్టు ఆదేశాలున్నా ఆయన్ను ఉద్యోగ సంఘాలతో జరిపే చర్చలకు కూడా అహ్వానించడం లేదు. ఈ నేపథ్యంలో ఇవాళ కీలక పరిణామం చోటు చేసుకుంది ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘంతో పాటు వాణిజ్య పన్నుల సంఘం అధ్యక్షుడిగా కూడా ఉన్న కేఆర్ సూర్యనారాయణకు ఇవాళ మరోసారి హైకోర్టులో ఊరట లభించింది. వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల విషయంలో నిరసనలకు దిగి అసిస్టెంట్ కమిషనర్ ను నిర్బంధించారనే అంశంపై ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులను హైకోర్టు రద్దు చేస్తూ కీలక ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులపై సూర్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్ విచారించిన హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది

కాగా,గతంలో గవర్నర్ గా ఉన్న హరిచందన్ ను ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి జీత భత్యాల బకాయిలు ఇప్పించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ కలిసి ఫిర్యాదు చేశారు.

# కాసం, అనుబంధ వస్త్ర వ్యాపార సంస్థల మోసాలపై సిబిఐ విచారణ చేపట్టాలి

## - బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ డిమాండ్

హనుమకొండ మే1:(ఎక్స్ ప్రెస్ న్యూస్);చేనేత వస్త్రాలు అంటూ మిల్లు వస్త్రాలపై నేసిన చీరలను సినీ తారలతో మితిమీరిన ప్రచారాన్ని కొనసాగిస్తూ అనేక ఆఫర్లతో మహిళలను ,ప్రజలను మోసగిస్తూ , మభ్యపెడుతూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న కాసం వెడ్డింగ్ మాల్ ఉదంతంపై ఢిల్లీలోని చేనేత జౌళి శాఖ కమిషనర్ కు ఫిర్యాదు చేయడంతో అధికార యంత్రాగం కదిలి గురువారం వరంగల్లోని కాసం వెడ్డింగ్ మాల్ లో తనిఖీలు చేపట్టారని, నేరాన్ని అధికారుల సమక్షంలో యాజమాన్యం అంగీకరించిందని బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. తాము ఖరీదు చేసిన పోచంపల్లి ఇక్కత్ చీరను చేనేత వస్త్రం అంటూ నమ్మించి అమ్మి అందుకు సంబంధించిన కొనుగోలు రశీదును సహితం అందించి అధికారుల సమక్షంలో మాత్రం ఇది మిల్లు వస్త్రం అని కాసం వెడ్డింగ్ మాల్ యాజమాన్యం అంగీకరించడాన్ని చూస్తే ప్రజలను ఎంత దారుణంగా మోసం చేస్తున్నారో తేలికగా అర్థమవుతుందని దాసు సురేశ్ తెలిపారు. గడిచిన 9 సంవత్సరాల కాలంలో కాసం వెడ్డింగ్ మాల్ యాజమాన్యం రాష్ట్రవ్యాప్తంగా అనేక అనుబంధ సంస్థలను నెలకొల్పడం,సినీ తారలతో ప్రచారం చేయించడం ,పేపర్, టీవీ , హోర్డింగ్ లతో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం ఎలా సాధ్యమవుతుందో ప్రజలు ఒకసారి గమనించాలని దాసు సురేష్ కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు కాసం వెడ్డింగ్ మాల్ అంగీకరించిన ఈ ఆర్థిక నేర నిరూపణను సుమోటగా తీసుకొని వెంటనే సిబిఐ దర్యాప్తుకు ఆదేశించాలని దాసు సురేష్ కోరారు. అపరిమిత ఆదాయాన్ని అక్రమంగా సంపాదిస్తున్న కాసం షాపింగ్ మాల్ యాజమాన్యంపై ఇన్ కమ్ టాక్స్ అధికారులు సహితం దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు ఇంత అన్యాయం, మోసం జరుగుతున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టీ పట్టనట్టు ఉండడం చూస్తే పలు అనుమానాలకు తెర లేపుతున్నట్లు ఉందని దాసు సురేష్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించాలని చెబుతున్న సంబంధిత మంత్రి కేటీఆర్ సోమవారం తాను తొడుగుతున్న చేనేత వస్త్రాలు అసలువో , నకిలీవో సరిచూసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఘరానా మోసం కొనసాగుతూ వేలకోట్ల ప్రజ దనాన్ని దుర్వినియోగం అవుతున్నా ఈ సంగతి కేటీఆర్ కి తెలియదా అని ప్రశ్నించారు. 100 కోట్ల లిక్కర్ స్కాం ని తీవ్రంగా పరిగణించిన ఇడి వేలకోట్ల రూపాయలు ఏరులై పారుతున్న నకిలీ చేనేత వస్త్రాల దందాపై నేటికీ స్పందించకపోవడం విచారకరం అన్నారు. ఈ పూర్తి తథంగానికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సైతం అధికారులు కొనసాగించిన దాడులను ప్రజలకు తెలియజేయకుండా తమ సంస్థలకు ప్రకటనలు రావనే నెపంతో వాస్తవాలను దాచిపెట్టి పత్రిక విలువలను పణంగా పెట్టడం సరికాదన్నారు. ప్రజా ప్రయోజనాలను,చేనేత కార్మికుల సంక్షేమార్థం కొనసాగుతున్న ఈ పోరాటంలో దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదని దాసు సురేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నాయకులు అదేపు నగేష్ , పొదిల రాజు ,మడత కిషోర్ , దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర నాయకులు పొదిల సాయిబాబా,కొండా యాదగిరి గొల్ల కురుమ నాయకులు అన్న రాజు ముదిరాజ్ సంఘ నాయకులు బగ్గి రాజు తదితరులు పాల్గొన్నారు..


# విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్
ఎలకుర్రు



ఆహ్వానము
విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవ సభ
విశ్వదాత అవార్డులు 2023

వేదిక : భ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి వారి కళావేదిక, ఎలకుర్రు, పామర్రు మండలం
తేది : 03-05-2023 బుధవారం
సమయం: రాత్రి 7-00 గంటలకు

సభాధ్యక్షులు :
శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు,
కార్యదర్శి, విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్

ముఖ్యఅతిథి :
శ్రీ కైలే అనిల్ కుమార్
శాసన సభ్యులు , పామర్రు

ఆత్మీయ అతిథి :
డా. జి.వి.పూర్ణచంద్
కార్యదర్శి, కృష్ణాజిల్లా రచయితల సంఘం

అవార్డు గ్రహీతలు :
డా. శ్రీ రాధశ్రీ, ప్రముఖ కవి, హైదరాబాద్
శ్రీ చెన్నాప్రగడ వెంకట నాగ సత్యనారాయణశర్మ, ప్రముఖ జర్నలిస్ట్, విజయవాడ
శ్రీ పొన్నాడ సత్యప్రకాశరావు
డా. శ్రీ ఐ.కిరణ్‌పాల్
శ్రీ పసుమర్తి వెంకటేశ్వర శర్మ, హైదరాబాద్

ఆహ్వాన కమిటీ


# మంత్రి బొత్సని గోల్డెన్ ఉత్సవాలకి ఆహ్వానం పలికిన కర్రి వేణుమాధవ్



విశాఖపట్నం మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఉద్యమం కార్యక్రమానికి 50 సంవత్సరాల గోల్డెన్ ఉత్సవాలకు విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ లో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మాత్యులు సీనియర్ వైఎస్ఆర్పిపి నాయకులు బొత్స సత్యనారాయణకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జ్ కర్రి వేణుమాధవ్ ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు నాయకుడు పిన్నింటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 31న ఛలో సిద్దేశ్వరం.. బొజ్జా దశరథరామిరెడ్డి

అమరావతి, మే1:అనెల 31వతేదీన ఛలో సిద్ధేశ్వరంకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో మే 31న జరిగే సిద్దేశ్వరం జల జాగరణ దీక్షకు సంబంధించి కరపత్రాలను ఆయన విడుదల చేసారు. అనంతరం దశరథరామిరెడ్డి మాట్లాడుతూ? పాలకుల నిర్లక్ష్యంతో, ప్రతిపక్ష పార్టీల నిరాదరణతో వెనుక పడవేయబడిన రాయలసీమ సమాజం, సిద్దేశ్వరం ఉద్యమ స్ఫూర్తితో గొంతు సవరించుకుంటూ అనేక హక్కుల సాధన దిశగా గత ఏడు సంవత్సరాలుగా ముందుకు నడుస్తున్నదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ ఉద్యమ చరిత్రలో మే 31, 2016 న నిర్వహించిన సిద్దేశ్వరం అలుగు సాధన ఉద్యమం చారిత్రాత్మకమైనదని, ఏ రాజకీయ పార్టీ అండ దండ లేకుండా 30 వేల మందికి పైగా రాయలసీమ ప్రజానీకం స్వచ్ఛందంగా, తమ వాహనాలతో, తమ ఆహారంతో, తమ నీటితో సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన అన్నారు. ఈ సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన కార్యక్రమం రాయలసీమలో ఉద్యమ స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు.

అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి సాధించడంలో ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ పార్టీలది అత్యంత కీలకమైన పాత్ర అనీ, కానీ ఎందుకో ఏ భావజాలానికి లోనయ్యో, ఏ శక్తులకు వశమయ్యో రాజకీయ పార్టీలన్నీ రాయలసీమ అంశాలను తమ అజెండాగా చేర్చుకోవడానికి వెనకంజ వేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దశలో రాయలసీమ అభివృద్ధికి కీలకమైన అంశాలను కూడా రాజకీయ పార్టీలు తమ అజెండాలో చేర్చుకునేలాగా ఒత్తిడి పెంచే కార్యక్రమాలతో యావత్తు రాయలసీమ సమాజం ముందుకు నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా అడుగులు వేస్తూనే మనకు స్ఫూర్తినిచ్చిన సిద్దేశ్వరం ప్రజా శంకుస్థాపన ఏడవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించి రాజకీయ పార్టీలన్నీ సహకరించేలాగా ఒత్తిడి పెంచుదామని ఆయన అన్నారు. అనేక పాలన అనుమతులను సాధించినా, వాటి అమలు దిశగా రాయలసీమ సమాజం పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశగా మే 31 న సిద్దేశ్వరం జల జాగరణ దీక్ష ను భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 31న సాయంత్రం 6 గంటల నుండి జూన్ 1 ఉదయం 10 గంటల వరకు సంగమేశ్వరం, కొత్తపల్లి మండలం, నంద్యాల జిల్లాలో చేస్తున్న సిద్దేశ్వరం జల జాగరణ దీక్షలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేస్తున్నామని దశరథరామిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, కార్యదర్శి మహేశ్వర రెడ్డి, కొమ్మా శ్రీహరి,మనోజ్ కుమార్ రెడ్డి, పట్నం రాముడు, క్రిష్ణమోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నిట్టూరు సుధాకర్ రావు, రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మేడే వేడుకలు

రాజన్న సిరిసిల్ల, మే1:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో సోమవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేములవాడ ప్రభుత్వ భూమిలో వెయ్యి 25 సర్వేనెంబర్ గల జాగాలో, మహాలక్ష్మి బైపాస్ రోడ్డు చౌరస్తా వద్ద, మున్సిపల్ కార్యాలయం ముందు, లేబర్ అడ్డా ముందు గల సెంట్రింగ్ సంఘంలో, పెయింటర్ సంఘంలో కార్మిక జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డప్పు శీను, పెంట మల్లయ్య, పెంట నరేష్, కోర క్రాంతి, పెంట మల్లయ్య, డప్పు శీను, . మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.వి అనసూర్య, తదితరి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

మెదక్, మే1: (నేటినిజం ప్రతినిధి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించవలసినదిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదీదారుల నుండి అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్ లతో కలిసి 13 వినతులు స్వీకరించారు. ఇందులో ధరణికి సంబంధించి 6 వినతులు రాగా, డబుల్ బెడ్ రూమ్ ఇంటికి ఒకటి, ఆసరా పింఛనలకు సంబంధించి 3, ఇతర శాఖలకు సంబంధించి 3 వినతులు వచ్చాయి.

అనంతరం ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల పంట నష్టపోయిన పంట వివరాలపై సమీక్షిస్తూ ఏ రైతు నష్టపోకుండా గ్రామ వారీగా రైతువారీగా ఖచ్చితమైన పంట నష్టం వివరాలు సేకరించవలసినదిగా వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రధానంగా 9 మండలాలలోని 20,089 రైతులకు చెందిన 25,166 ఎకరాలలో వరి, పండ్ల తోటలకు నష్టం జరిగినట్లు ప్రాధమిక అంచనాకు వచ్చామని అన్నారు. ఇందులో వరి పంటకు సంబంధించి 19,517 రైతులకు చెందిన 23,580 ఎకరాలు, పండ్ల తోటలకు సంబంధించి 572 మంది రైతులకు సంబంధించి 1,586 ఎకరాలలో పంట నష్టం జరిగిందని అన్నారు. మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, ఉద్యాన అధికారులు, మండల ప్రత్యేకాధికారులు గ్రామ వారీగా, రైతు వారీగా పంట సర్వే నిర్వహించి వరి ధాన్యం తో పాటు ఉద్యాన పంటలు దెబ్బతిన్న వివరాలను పక్కాగా సేకరించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని, నమోదు చేయుటకు ధరణి ఆపరేటర్ల సేవలు ఉపయోగించాలని సూచించారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఇట్టి సమాచారాన్ని బుధవారం లోగా 14 కాలమ్స్ ప్రొఫార్మాలో సేకరించి సమర్పించాలని ఆదేశించారు. రైతుల బ్యాంకు ఖాతా వివరాలు కూడా సేకరించాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్ పుట్ సబ్సిడీ క్రింద ఎకరాకు 10 వేల రూపాయలు అందించుటకు ఉత్తర్వులు జారీచేసిందని అన్నారు. ఈ నష్ట పరిహారం కాస్తు చేస్తున్న కౌలుదారులకు కూడా వర్తిస్తుందని, కాబట్టి నివేదిక పక్కాగా ఉండాలని అన్నారు. ఈ యాసంగిలో ఇటీవల పంట నష్టపరిహారం పొందిన లబ్ధిదారునికి తిరిగి చెల్లించబడదని కలెక్టర్ స్పష్టం చేశారు. వచ్చిన పంట సమగ్ర సర్వే నివేదికలను బుధవారం సమావేశమై పరిశీలించి ప్రభుత్వానికి పంపుతామని, ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నేరుగా రైతు ఖాతాలో డబ్బులు జమచేస్తున్నదని అన్నారు. ఈ సమావేశంలో అధికారులు, జయరాజ్, ఖాసీం, రజాక్, కృష్ణమూర్తి, రాధాకిషన్, జెంలా నాయక్, విజయలక్ష్మి, కరుణ, బ్రహ్మాజీ, సాయిబాబా, నారాజ్, శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్ నారాయణ్, ఆర్.డి.ఓ సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

# పంజాగుట్ట శ్మశాన వాటికలో యువతి హల్చల్-ప్రియుడు మోసం చేశాడంటూ న్యూసెన్స్

హైదరాబాద్, మే1: పంజాగుట్టలో గత అర్ధరాత్రి స్మశానంలో యువతి హల్చల్ చేయడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. పంజాగుట్ట స్మశాన వాటిక వద్ద అర్ధరాత్రి ఓ యువతి రెండు గంటలపాటు రచ్చ చేసింది. ఆ యువతి స్మశానంలో ఒక వ్యక్తిని ప్రేమించానని, అతను తనను వదిలేశాడని నానా న్యూసెన్సు చేసింది. ఏడుపులు, పెడబొబ్బలు పెట్టింది. అర్ధ రాత్రి పన్నెండు గంటల నుంచి దాదాపు రెండు గంటల పాటు గొడవ జరిగింది. తన ప్రియుడు తనను విడిచి పెట్టాడు అని స్మశానంలో కన్నీళ్లు పెట్టుకోవడం ప్రారంభించింది.

ఇక అర్ధరాత్రి స్మశానంలో యువతి ఏడుస్తూ ఉండడాన్ని గమనించిన స్థానికులు ఆమె వివరాలు తెలుసుకొని ఏమైంది అంటూ మొదట ప్రశ్నించారు. తనను ప్రేమించిన అబ్బాయి తనను మోసం చేశాడని, తనను వదిలి వెళ్లిపోయాడని పేర్కొన్న యువతి తాను ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నాను అని చెప్పింది. అతను లేని జీవితాన్ని ఊహించుకోలేనని పేర్కొంది. దీంతో ఆ యువతిని ఆత్మహత్య చేసుకోవద్దని సూచించిన స్థానికులు, ఎంతసేపటికి యువతి వినకపోయేసరికి పోలీసులకు సమాచారం అందించారు .దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువతిని స్మశానవాటిక నుంచి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆమె వివరాలు తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇక పోలీసులు యువతిని తీసుకు వెళ్ళడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# కర్ణాటక బిజెపి మ్యానిఫెస్టోలో ఉచితాల గానం - గ్యాస్, పాలు, టిఫిన్, భోజనంతో సహా అన్నీ ఫ్రీనే




న్యూఢిల్లీ, మే1:బెంగుళూరు - కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు కన్నడిగులకు వరాల జల్లు కురుపిస్తున్నాయి. ఇప్పటికే జేడీఎస్ పార్టీ మేము అధికారంలోకి వస్తే పేదలకు ఆరు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తామని, ఆటో డ్రైవర్లు, మహిళలు, సెక్యూరిటీ గార్డులు, రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. తాజాగా బిజెపి కార్మికుల దినోత్సవం మే 1వ తేదీన సోమవారం బెంగళూరులోని ఓ ప్రైవేట్ హోటల్ లో కర్ణాటక ఎన్నిలక మేనిఫెస్టోను విడుదల చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీఎం బసవరాజ్ బొమ్మయ్, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప తదితరులు ఎన్నికల మేనిఫేస్టో విడుదల చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలాగా మేము తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చెయ్యలేమని. మేము చేసే పనులనే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలు వివరించామని అన్నారు. కర్ణాటకలోని 224 అసెంబ్లీ నియోజక వర్గాల్లోని ప్రజల అభిప్రాయాలు సేకరించి ఎన్నికల మేనిఫెస్టో తయారు చేశామని సీఎం బసవరాజ్ బొమ్మయ్ అన్నారు.× బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తామని బీజేపీ నాయకులు చెప్పారు.× బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి ప్రతిరోజు ఉచితంగా అర్ధలీటర్ నందిని పాలు అందిస్తామని అన్నారు.× ప్రతినెల 5 కేజీల సిరిధాన్యాలు ఉచితంగా అందిస్తామని బీజేపీ ఎన్నికల హామీ ఇచ్చింది.

అటల్ బిహారి వాజ్ పేయి పేరుతో ప్రతివార్డులో ఆహార కేంద్రాలు ఏర్పాటు చేసి తక్కువ ధరకు నాణ్యమైన భోజనం, టిఫిన్లు అందిస్తామని అన్నారు.× ఇళ్లులేని నిరుపేదలకు పక్కా ఇండ్లు క్టిస్తామని బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు.× సామాజిక న్యాయ నిధి పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళల పేరుతో రూ. 10,000 ఫిక్సెడ్ డిపాజిట్ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. సీనియర్ సిటిజన్లకు ప్రతి సంవత్సరం ఉచిత వైద్యపరీక్షలు చేయిస్తామని, అందుకు అయ్యే ఖర్చు బీజేపీ ప్రభుత్వమే భరిస్తుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వివరించారు.

# ముమ్మరంగా సాగుతోన్న సుడాన్ భారతీయుల తరలింపు ప్రక్రియ

న్యూ డిల్లీ మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సుడాన్ లో చిక్కుకున్న భారతీయుల తరలింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కావేరి' తో అక్కడ చిక్కుకున్న వారిని స్వదేశానికి తరలిస్తోన్న విషయం తెలిసిందే. భారత వాయుసేన, నావికా దళాల ద్వారా దశల వారీగా భారతీయుల్ని సురక్షితంగా స్వదేశానికి చేర్చే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా వాయుసేన ద్వారా ఇప్పటి వరకు 1,400 మంది సురక్షితంగా స్వదేశానికి చేరారు. సైన్యం, పారామిలిటరీ దళాల మధ్య ఘర్షణతో అతలాకుతలమైన సూడాన్ నుంచి 'ఆపరేషన్ కావేరి' ద్వారా కేంద్రం భారతీయుల్ని స్వదేశానికి రప్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు దాదాపు 1,400 మందిని సురక్షితంగా స్వదేశానికి తరలించినట్లు భారత వాయు సేన తాజాగా వెల్లడించింది. రెండు సీ-130 జే విమానాల ద్వారా 260 మందిని తీసుకొచ్చినట్లు ఐఏఎఫ్ ట్విట్టర్ ద్వారా తెలియజేసింది. వీరిలో 90 ఏండ్లు పైబడిన వారు ఉన్నట్లు పేర్కొంది. ఒకరి వయసు 102 ఏండ్లని వివరించింది.కాగా, ఆపరేషన్ కావేరీలో భాగంగా.. సోమవారం ఉదయం 186 మంది భారతీయులు సుడాన్ నుంచి కొచ్చి చేరుకున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి ట్విట్టర్ ద్వారా తెలిపారు. సుడాన్ నుంచి భారతీయుల తరలింపు కొనసాగు తుందని చెప్పారు. కాగా, ప్రభుత్వ వివరాల ప్రకారం.. సుడాన్‌లో 3,500 మంది భారతీయులు, 1000 మంది భారత సంతతి వ్యక్తులు చిక్కుకున్నారు. 'ఆపరేషన్ కావేరి'లో భాగంగా ఇప్పటి వరకు స్వదేశానికి చేరుకున్నవారి సంఖ్య 2,500 దాటింది.

# బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్మికులకు రూ.6లక్షల బీమా : హరీశ్‌రావు



సిద్ధిపేట, మే1: బీఆర్ఎస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు, భవన నిర్మాణరంగ కార్మికులకు రూ. 6లక్షల బీమాను అందిస్తుందని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్ధిపేట జిల్లాకేంద్రంలోని శ్రీనివాస టాకీసు బీఆర్‌టీయూ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మేడే వేడుకలకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద కులం కార్మికుల కలమని, మనమంతా కార్మికులమేనన్నారు. అలసిపోకుండా నిరంతరం వెలుగులను ఇచ్చేవాడు సూర్యుడని, అలసిపోకుండా ప్రపంచానికి సేవచేసే వాడు కార్మికుడన్నారు.కార్మిక దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కు కులం, మతం లేదని, కార్మికుల శ్రేయస్సు కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో పని చేస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు కాల రాస్తున్నదని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతున్నదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను గుర్తించాల్సిన బాధ్యత అన్ని ప్రభుత్వాలపై ఉన్నదన్నారు. బీజేపీ పాలిత 16 రాష్ట్రాలలో బీడీలు చేసే కార్మికులను పట్టించుకోలేదని, ఆ విషయం మహిళా మంత్రి అయిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తెచ్చినా పట్టించుకోలేద విమర్శించారు.ప్రపంచానికి సూర్యుడు వెలుతురు ఇస్తే, కార్మికుడు తన చెమట చుక్కలతో పని చేసి అందరీ జీవితంలో వెలుగు నింపుతారని కొనియాడారు. కార్మిక లోకం కలిసి పని చేయాలని, సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సిద్ధిపేటలో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా సూపర్ స్పెషాలిటీ వెయ్యి పడకల ఆసుపత్రి రాబోతున్నదని, త్వరలోనే ఈఎస్ఐ ? డిస్పెన్సరీ కార్మికులకు కోసం తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. ఒకప్పుడు బతుకు దెరువు కోసం పొట్ట చేత పట్టుకుని పోయేవారని.. కానీ, ఇవాళ బతుకుదెరువు చూపే తెలంగాణగా పక్క రాష్ట్రాల కూలీలు వచ్చి ఇక్కడ పని చేసుకుని జీవనం కొనసాగిస్తున్నట్లుగా చెప్పుకొచ్చారు.

జకార్యక్రమంలో నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, బీఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్, రాష్ట్ర కార్యదర్శి మంచే నర్సింలు, ఎల్లు రవీందర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని రాజేంద్రనగర్ కాలనీలో కొలువు దీరిన మహా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు.

# అయ్యప్పటెంట్ హౌస్‌లో ఘనంగా మేడే వేడుకలు

## - కార్మికులను మేడే సందర్భంగా సత్కరించిన యజమాని జక్కుల వెంకటరమణ



ఖమ్మం, మే1: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగర బురహాన్ పురం,బస్ డిపోరోడ్డు నందుగల అయ్యప్ప టెంట్ హౌస్ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మికుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.మేడే సందర్భంగా కేక్ ను అయ్యప్ప టెంట్ హౌస్ ప్రొప్రైటర్ జక్కుల వెంకటరమణ కార్మికులతో కలసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సంస్థ అయినా, ఏ పరిశ్రమ అయినా, ఏ వ్యాపారం అయినా కార్మికుల కష్టం వల్లే ఆయా సంస్థలు మరియు యజమానులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని ఆయన అన్నారు.కార్మికులు మధ్యపానానికి దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఆయన కోరారు. గత కొన్ని సంవత్సరాలనుండి తమ షాపులో సేవలందిస్తున్న ఉద్యోగులను ఆయన శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప టెంట్ హౌస్ సూపర్ వైజర్ కంబాల శ్రీనివాసరావును, మొఘపోతుల హర్షవర్ధన్ ను,కందుకూరి మహేష్ ను,మాచర్ల అనిల్ ను,కోప్పెర దేవేందర్ ను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మహబూబ్‌నగర్, మే1: నాలుగు సంవత్సరాల తర్వాత జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు శాశ్వత ఉద్యోగం కల్పిస్తామన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు పరచాలని నాగర్ కర్నూల్ డివిజన్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యున్నత చదువులు చదివి కూడా మన ప్రాంతానికి సేవ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గ్రామాభివృద్ధి కోసం అనునిత్యం పాటు పడే తమను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు.

# విద్యుత్ తీగలు పడి ఆవు, దూడ మృతి

కరీంనగర్, మే1:అకాల వర్షానికి కరీంనగర్ లోని 18వ డివిజన్ రేకుర్తిలోని సర్వేనెంబర్ 108 లోని బండారి అశోక్ వ్యవసాయ భూమిలో ఈదురు గాలులకు రాత్రి 11గంటల కు చెట్ల కొమ్మలు కరెంటు తీగలపై వాలి 11ఎల కరెంటు తీగ తెగి పడడంతో అక్కడే ఉన్న ఒక ఆవు ఒక దూడ విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. రేకుర్తి ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వెంటనే 18వ డివిజన్ కార్పొరేటర్ సూదగోని మాధవి కృష్ణ గౌడ్ లైన్ మెన్ ను తీసుకువచ్చి విద్యుత్ లైన్ ఆఫ్ చేసి అక్కడే ఉన్నా ఇంకొక మూడు ఆవులను రక్షించడం జరిగింది. ఈ విషయాన్ని మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్ రావుకు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా.. స్పందించి వెంటనే రైతులకు ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందిస్తామని తెలిపారు.

# కార్మికుల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు

మెదక్, మే1: (నేటినిజం ప్రతినిధి):భవన , ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన ,ఇతర నిర్మాణ బోర్డు ద్వారా కార్మిక శాఖలో గుర్తింపు పొందిన కార్మికుల కోసం కామన్ సర్వీస్ సెంటర్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ కేర్ లో సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవలసినదిగా సూచించారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ పట్ల సరైన అవగాహన లేకపోవడంతో పాటు ప్రమాదాలకు గురవుతుంటారని, వినికిడి కోల్పోవడంతో పాటు చర్మ, శ్వాస కోసం సంబంధిత వ్యాధులతో బాగుపడుతుంటారని అన్నారు. అటువంటి వారికీ సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించి మెరుగైన చికిత్స అందించవచ్చని తద్వారా మరింత సమర్థవంతంగా పనిచేస్తూ మెరుగైన జీవితాన్ని గడపవచ్చనే ఉద్దేశ్యంతో ఈ హెల్త్ కేర్ ను ప్రారంభించామన్నారు. ఈ నెల 2 న నర్సాపూర్ క్రాస్ రోడ్ లోని వి-మార్ట్ దగ్గర, 3 న చిన్న శంకరంపేట మండలం గవ్వలపల్లి క్రాస్ రోడ్ లోన్ సెయింట్ మైత్రి స్కూల్ నందు, 4 న తూప్రాన్ మునిసిపల్ కార్యాలయ ఆవరణలో హెల్త్ కేర్ శిబిరాలను నిర్వహిస్తున్నామని అన్నారు.

# రైతులను ఆదుకుంటాం-అసెంబ్లీ ప్యానల్ స్పీకర్



నిజామాబాద్, మే1: అకాల వర్షంకు నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని ఆదుకుంటామని అసెంబ్లీ ప్యానెల్ స్పీకర్ హనుమంత్ షిండే రైతులకు భరోసా ఇచ్చారు. సోమవారం గ్రామీణ ప్రాంతాల్లోని రైతన్నల కష్టసుఖాలు తెలుసుకోవడానికి పలు గ్రామాల్లో పర్యటించారు. వాజిద్ నగర్ పంట పొలాలను అదేవిధంగా అకాల వర్షంకు నష్టపోయిన వారి రైతులను ధైర్యంగా ఉండాలంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రైతులతో మమేకమై సుమారు రెండు గంటల పాటు పంట పొలాలను పరిశీలిస్తూ రైతులకు ధైర్యం నింపారు. వడగండ్ల వానకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యంను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కు ఫోన్ ద్వారా విన్నవించడం జరిగిందని రైతులకు వివరించారు. మీ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు ఏం చేసిందని వివరించాలన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తమ ప్రభుత్వం పనితీరు రైతులకు సబ్సిడీ, రైతుబంధు, రైతు బీమా ప్రవేశపెట్టి రైతులకు కరెంటు విషయంలో రైతులకు సరిపడా విద్యుత్ ను సరఫరా చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దేనిని అన్నారు. గత ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబించాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత చెరువులు, కుంటలు పూడికలు తీసి రైతులకు రెండు పంటలు పండించుకొని ఆనంద ఉత్సవంతో రైతులు జీవిస్తున్నారని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో రైతుల కన్నీటి బాధలు ఎక్కువగా ఉండేవని, ప్రస్తుతం రైతుల బాధలు తీర్చే ప్రభుత్వమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వాజిద్ నగర్ ఎంపీటీసీ సాయిలు, పుల్కల్ సొసైటీ చైర్మన్ రామ్ రెడ్డి, బారాస మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నాల్చేరి రాజు, బిచ్కుంద మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బస్వరాజ్ పటేల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ రాజకీయ పరిష్కారాలతో ప్రజల వద్దకు లోక్ సత్తా

## -2023 సాధారణ ఎన్నికల్లో అన్ని స్థానాలకు పోటీ

## - లోక్ సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో తీర్మాణం

హైదరాబాద్ మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ప్రత్యామ్నాయ రాజకీయ పరిష్కారాలతో ప్రజల వద్దకు వెళ్ళాలని, 2023 సాధారణ ఎన్నికల్లో అన్ని స్థానాలకు పోటీ చేయాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో తీర్మానించారు. సోమవారం హాబిట్స్ లోని చంద్ర లోక్ కాంప్లెక్స్ లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. కార్యవర్గ సమావేశం అనంతరంఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో తుమ్మనపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ రాజకీయ పరిష్కారాలతో ప్రజల వద్దకు వెళ్లాలని 2023 సాధారణ ఎన్నికల్లో పోటీ చేయాలని సమావేశం అన్ని స్థానాలకు తీర్మానించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ అనుచ్చితి నెలకొందని అధికార ప్రతిపక్ష పార్టీలు విధానాలకు పరిమితమై ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని ఆయన విమర్శించారు. విమర్శలకు ప్రతి విమర్శలతోనే అవి వెలబుస్తున్నాయని శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. ప్రజలు కేంద్రంగా పరిపాలన జరగాలంటే అది సత్తా పార్టీ పార్టీకి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజాప్రతినిధులు దళిత బంధువు పతకం లో లంచాలు మెక్కారని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించడం అధికార పార్టీ దిగజారిన విధానాలకు నిదర్శనమని అన్నారు. లంచాలుమెక్కిన ప్రజాప్రతినిధులు జాబితాలను వెంటనే బయటపెట్టాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.అట్టి అవినీతి సొమ్మును ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని తుమ్మలపల్లి డిమాండ్ చేశారు ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వ వైఖరి పలు అనుమానాలకు సావిస్తుందని సమావేశం అభిప్రాయం పడిందన్నారు. మద్యంఅమ్మకాలను ప్రభుత్వం ప్రధాన ఆదాయం మనరుగా చూడటం వల్ల యువత మహిళలు బ్రతుకులు దుర్భరంగా మారాయని అన్నారు. నేరాలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న అనేక సంఘటనలు ఉన్నాయన్నారు అయినా ప్రభుత్వం కనువిప్పు కలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునే పరిస్థితిలో ప్రభుత్వం లేదని ఆయన అన్నారు. విద్యా ఆరోగ్యం సకాలంలో ఆయా కుటుంబాలకు అందక అప్పులపాలై ఆత్మహత్యలు పాల్పడుతున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని ఆయన అన్నారు.

# 8న కెటిఆర్ చేతుల మీదుగా రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవం



హైదరాబాద్, మే1:రామగుండం పోలీస్ కమిషనరేట్ నూతన భవనాన్ని ఈనెల 8న ఐటి మినిస్టర్ కేటీఆర్, హోమ్ మినిస్టర్ మెహమూద్ అలీ తో పాటు పోలీసు ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభం కానుంది.. ఈ నేపథ్యంలో ఈరోజు తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా , రామగుండం పోలీస్ కమిషనర్ రేమా రాజేశ్వరి తో కలిసి నూతనంగా నిర్మించిన పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని సందర్శించారు. కమిషనర్ ఛాంబర్, అడిషనల్ డిసిపిల చాంబర్లో, కాన్ఫరెన్స్ హాల్, గ్రీవెన్స్ సెల్ హాల్, సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్స్, మీటింగ్ హాల్ ,రిసెప్షన్ కౌంటర్ ,కమిషనర్ కార్యా లయ వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది రూమ్స్ ను పరిశీలించారు.అనంతరం దామోదర్ గుప్తా మాట్లాడుతూ.. 28 ఎకరాల స్థలంలో 38 కోట్ల 50 లక్షల వ్యయంతో అధునాతన హంగులతో పోలీసు కమిషనరేట్ భవనాన్ని నిర్మించామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివి ధంగా సీఎం కేసీఆర్ పోలీసు యంత్రాంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో పోలీస్ కమిషనరేట్లు, ఎస్పీ బిల్డింగులు సిద్ధమయ్యాయని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు సీఎం కేసీఆర్ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన రామగుండం పోలీస్ కమిషనరేట్ ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ నెల 8వ తేదిన గౌరవ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు చేతులమీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగు తుందన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ ఐపిఎస్, మంచిర్యాల డీసీపీ సుదీర్ కేకన్ ఐపిఎస్., ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్, ఏసీపీ ఏడ్ల మహేష్, ఏఆర్ ఏసీపీ సుందర్ రావు, గోదావరిఖని ఇన్స్పెక్టర్ లు ప్రమోద్ రావు, ప్రసాద్ రావు, గోదావరిఖని 2 టౌన్ ఇన్స్పెక్టర్ వేణు గోపాల్, రామగుండం సీఐ చంద్ర శేఖర్, ఆర్ఐ లు మధుకర్, శ్రీధర్, విష్ణు ప్రసాద్, సిసి మనోజ్ కుమార్, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ - సాయి చనీద్, వినయ్ విశ్వనాథం, శ్రీనివాస్, తులసిదర్ , కాంట్రాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ విగ్రహానికి.. పంచాయతీ అధికారుల వినతి




నిజామాబాద్, మే 1:తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా జూనియర్ పంచాయతీ అధికారులు సమ్మె చేస్తున్నారు. సోమవారం బాన్సువాడ పట్టణంలో డివిజనల్ స్థాయిలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల పాటు ప్రొఫెషన్ తర్వాత రెగ్యులర్ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ మమ్మల్ని రెగ్యులర్ చేయడం లేదన్నారు. కాలయాపన చేస్తూ తమ భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెగిటివ్ కట్ ఆఫ్ మార్కులు ఉన్నప్పటికీ ఎంతో కష్టపడి చదివి పరీక్షలు రాసి నోటిఫికేషన్ ద్వారా మమ్మల్ని విధుల్లోకి తీసుకొని ప్రభుత్వం రెగ్యులర్ చేయకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెబాట పట్టామన్నారు. ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేసి ఆదుకోవాలని వారు కోరారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ మృతి

జగిత్యాల, మే1: జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకుంది. సోమవారం మల్యాల పోలీస్ స్టేషన్ కి చెందిన మహిళా కానిస్టేబుల్ వేదశ్రీ నడుపుతున్న ద్విచక్రవాహనం మల్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద అదుపుతప్పి కింద పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలుకాగా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళా కానిస్టేబుల్ భౌతికాయానికి జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో జిల్లా ఎస్పీ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా 1 మే 23 (నేటి నిజం ప్రతినిధి):చేసే పనిలో మేలకులు, నైపుణ్యాలు నేర్చుకుంటే కార్మికులకు మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని బాలుర పాఠశాలలో సోమవారం జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య శిబిరాలు నిరంతరాయంగా కొనసాగుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న భవన నిర్మాణ కార్మికులందరూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు డ్రైవర్లు, హోంగార్డులకు 5 లక్షల రూపాయల ప్రమాద బీమా ప్రీమియాన్ని రాష్ట్ర కార్మిక శాఖ చెల్లిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే తక్షణమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్మికులకు మే డే శుభాకాంక్షలు చెప్పారు. కార్మికులు తాము చేస్తున్న పనిని తక్కువ అంచనా వేసుకోవద్దని సూచించారు. కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ ప్రతినిధులు మాట్లాడారు. జిల్లా కార్మిక సంక్షేమ భవన నిర్మాణానికి ఇలిచిపూర్ శివారులో ఎకరం స్థలాన్ని కేటాయించారని చెప్పారు. ఈ విధంగా పూర్తిస్థాయిలో ఎకరం స్థలాన్ని కేటాయించింది కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోని ప్రథమం. ఇందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కార్మిక సంక్షేమ అధికారి సురేంద్ర కుమార్ మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అధికంగా ప్రభలే వీలుందని తెలిపారు. భవన నిర్మాణం సంక్షేమ మండలి, సిఎస్సి హెల్త్ కేర్ ద్వారా 50 రకాల వైద్య పరీక్షలను కార్మికుల వద్దకు వచ్చి పరీక్షలు చేసి ఆరోగ్య కార్డును అందజేస్తారని చెప్పారు. అవసరమైతే దగ్గర్లోని ఆసుపత్రికి సిఫారసు చేస్తారని పేర్కొన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ న్యాక్ సెంటర్ కామారెడ్డి లో మేషన్, ప్లంబర్, పెయింటర్, హౌస్ ఎలక్ట్రీషన్, టైలరింగ్ లలో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను, కుట్టు మిషన్లను అందజేసినట్లు చెప్పారు. ఈ సంవత్సరం భవన నిర్మాణ కార్మికులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా 594 మందికి లబ్ధి చేకూర్చడం జరిగిందని పేర్కొన్నారు.న్యాక్ ద్వారా నైపుణ్య అభివృద్ధి కోసం 506 మంది తమ శిక్షణను పూర్తి చేసుకున్నారు. సెట్విన్ ద్వారా భవన నిర్మాణం కార్మికుల పిల్లలకి సాంకేతిక విద్యను 90 రోజుల పాటు అందించినట్లు చెప్పారు. 800 మంది శిక్షణ పొందినట్లు ఆయన పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో ఒక లక్ష 49 వేలకు పైగా అసంఘటిత కార్మికులు ఇస్రం పోర్టల్ లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలియజేశారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా బీడీ కార్మికులకు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులకు జీవనభృతిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి కమ్రుద్దీన్, న్యాక్ సెంటర్ ఇంచార్జ్ లింబాద్రి, సిఎస్సి హెల్త్ కేర్ జిల్లా ఇంచార్జ్ శశికాంత్, ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

# చికోటి ప్రవీణ్‌తో పాటు మరి కొంత మంది అరెస్టు



న్యూ డిల్లీ మే 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్)వివాదాలతో సహవాసం చేస్తూ.. సెలబ్రిటీ స్టేటస్ ను ఎంజాయ్ చేసే చికోటి ప్రవీణ్ ను ఆయన తో పాటు మరి కొంత మందిని థాయ్ లాండ్ పోలీసులు అరెస్టు చేసినట్లుగా చెబుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.థాయ్ లాండ్ లోని పటాయాలోని ఒక విలాసవంతమైన హోటల్ లో నిర్వహిస్తున్న గ్యాంబ్లింగ్ దందాను అక్కడి పోలీసులు భారీ స్కెచ్ తో పట్టుకున్నట్లుగా చెబుతున్నారు. మొత్తం 93 మందిని అదుపులోకి తీసుకోగా.. వారిలో 83 మంది భారతీయులుగా చెబుతున్నారు. వారిలో హైదరాబాద్ మహానగరానికి చెందిన గ్యాంబ్లర్ చికోటి ప్రవీణ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది.భారతీయులతో పాటు వివిధ దేశాలకు చెందిన వారు ఉన్నారు. పోలీసులకు పట్టుబడిన 93 మందిలో 14 మంది మహిళలు కావటం గమనార్హం. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఒక మహిళ ఉన్నట్లుగా తెలుస్తోంది. నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న గేమింగ్ చిప్స్ విలువ ఏకంగా రూ.20 కోట్లు ఉండటం చూస్తే.. ఇదెంత భారీ రాకెట్ అన్న విషయం అర్థమవుతుంది. పెద్ద ఎత్తున భారత కరెన్సీని సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారు.గ్యాంబ్లింగ్ ఆడేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖుల్ని థాయ్ లాండ్ లోని పటాయాకు తరలించిన వ్యవహారంపై స్థానిక పోలీసులకు సమాచారం అందటంతో వారు దాడులు చేసినట్లు చెబుతున్నారు. థాయ్ మహిళలతో కలిసి క్యాసినో ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. తాజాగా థాయ్ పోలీసులకు పట్టుబడిన వారిలో పెద్ద తలకాయలు ఉండటం సంచలనంగా మారింది .రెండు తెలుగురాష్ట్రాలకు చెందిన సంపన్నులు పలువురు మూడు రోజుల క్రితం పటాయాకు తీసుకెళ్లి.. గ్యాంబ్లింగ్ ఆటతో మస్తు బిజీగా ఉన్నట్లు చెబుతున్నారు. చికోటి అరెస్ట్ ను ఇప్పటివరకు అధికారికంగా ఎవరూ కన్ఫర్మ్ చేయటం లేదు.ఇదిలా ఉంటే.. థాయ్ లాండ్ లో చట్టాలు కఠినంగా ఉంటాయని.. గ్యాంబ్లింగ్ కేసులో దొరికితే శిక్షలు కఠినంగా ఉంటాయన్న సమాచారంతో తాజాగా పోలీసులకు పట్టుబడిన వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. ఏప్రిల్ 27 నుంచి ఒక కాన్ఫరెన్సు హాల్ ను బుక్ చేసి మరీ.. ఈ భారీ గ్యాంబ్లింగ్ క్రీడను నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు.ఈ మొత్తం ఎపిసోడ్ వెనుక కీలకంగా వ్యవహరించిన మహిళ ఎవరు? ఆమె ఎక్కడి వారు? ఆమెకు.. చికోటి ప్రవీణ్ కు ఉన్న లింకులు ఏమిటి? అన్నదిప్పుడు ప్రశ్నలుగా మారాయి. చికోటి ఏం చెబితే ఇంత పెద్ద తలకాయలు థాయ్ లాండ్ కు వెళ్లాయి? అన్నదిప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

# పెద్దకర్మకు హాజరైన పొంగులేటి శీనన్న సైన్యం



ఖమ్మం, మే1: (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దగోపతి గ్రామపంచాయతీకి చెందిన ఇజ్జగాని రామలక్ష్మణ్ ఇటీవలే మృతి చెందాడు. వారి దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మనోధైర్యాన్ని నింపి సానుభూతి తెలిపిన పొంగులేటి శ్రీనన్న సైన్యం పెద్ద మునగాల గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్, పెద్దగోపతి యూత్ అధ్యక్షులు ఊటుకూరు రంజిత్, గుండ్ల గోపాల్ రావు, ఇజ్జగాని నాగరాజు, తడికమల్ల గురవయ్య, ఉప్పి, సుధీర్, నర్సి, శ్యామ్, పండు, వెంకటేశ్వర్లు, శీను, కిట్టయ్య, నవీన్, రవి, జయరాజ్, చార్లెస్, అగస్టీన్, జెట్టి కృష్ణ, కిట్టు, వెంకట్, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ దేశంలో మహిళల శవాలతో శృంగారం

న్యూ డిల్లీ మే 1 ( );పాకిస్తాన్ లో సమాధులు తవ్వి మహిళల శవాలపై అత్యాచారాలు చేస్తున్నారని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఆ మరణించిన మహిళల కుటుంబీకులు ఆ సమాధులకు గ్రిల్స్ ఏర్పాటు చేసి తాళాలు బిగుస్తున్నారని కథనాలు వచ్చాయి. శవాలతో సంభోగం పాకిస్థాన్ లో ట్రెండ్ గా మారిందని.. పాకిస్తాన్ లో పలు ప్రాంతాల్లో ఇలా విచ్చలవిడిగా మహిళల సమాధులు తవ్వేసి శవాలతో సంభోగిస్తున్నారని మీడియాలో కథనాలు వచ్చాయి.

కాగా ఇలా శవాలతో శృంగారం చేయడాన్ని నెక్రోఫీలియా అంటారు. గతంలో పలు దేశాల్లోనూ ఇలా శవాలతో సంభోగించారనే సంఘటనలు వెలుగుచూశాయి. ఇది మనిషిలో ఉండే ప్రకృతి విరుద్ధక బుద్ధి అని చెబుతున్నారు. అయితే మీడియాలో వచ్చిన కథనాలు నిజం కావని అంటున్నారు. జర్నలిజం ముసుగులో కొందరు తప్పుడు కథనాలు రాస్తున్నారని మండిపడుతున్నారు. పత్రికల్లో ప్రచురితమైన కథనం ఫొటోల్లో నిజం లేదని అంటున్నారు. పాకిస్థాన్ లో సమాధికి గ్రిల్స్ ఏర్పాటు చేసి తాళం వేసి ఉన్న ఫొటోను ఒకదాన్ని పత్రికలు ప్రచురించాయి. అయితే ఆ ఫొటో పాకిస్థాన్ లోది కాదని.. మన హైదరాబాద్ నగరంలోదని చెబుతున్నారు. ఫ్యాక్ట్ చెక్ పేరుతో కొందరు జర్నలిస్టులే దీన్ని వెలుగులోకి తెచ్చారు. శత్రు దేశం పాకిస్తాన్ పై కావాలనే కొందరు ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని అంటున్నారు. ఆ మాటకొస్తే గతంలో మనదేశంలోనూ శవాలపై అత్యాచారాలు జరిగాయని గుర్తు చేస్తున్నారు.

హైదరాబాద్ లోని ఖబ్రస్తాన్ లో స్థలాలు లేవు..అన్ని నిండిపోయాయని అంటున్నారు. దీంతో చాలా మంది ముందే రిజర్వ్ చేసుకుని పెట్టుకుంటారని చెబుతున్నారు. కొన్ని సార్లు స్థలం లేక వేరే సమాధులు తవ్వి ఖననం చేయడం కూడా జరుగుతుందని పేర్కొంటున్నారు.అలా జరగకుండా కొందరు తమ కుటుంబ సభ్యుల సమాధులకు గ్రిల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారని వివరిస్తున్నారు. పాకిస్థాన్ లో అంటూ మీడియాలో వచ్చిన సమాధి ఫొటో హైదరాబాద్ లోని మాదన్నపేట రెయిన్ బజార్ లోనిదని చెబుతున్నారు.

# ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి : మంత్రి ఎర్రబెల్లి



హనుమకొండ : ధాన్యం సేకరణను, రవాణాను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులను ఆదేశించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, శాఖల అధికారులతో సోమవారం హనుమకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

అకాల వర్షంతో నష్టపోయిన మండలాల్లో జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, పంట నష్టాన్ని పరిశీలించి, రైతులకు ధైర్యాన్ని కల్పించాలని సూచించారు. దెబ్బ తిన్న పంటల నష్టాలను వెంటనే అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. కౌలు రైతులతోపాటు, నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని పేర్కొన్నారు. పంటలను ప్రభుత్వం పరంగా ఆఖరు గింజ వరకు కొనుగోలు చేయాలని వివరించారు.

రైస్ మిల్లర్లతోసమావేశాలు నిర్వహించి, కాంటాల్లో కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు.మక్కల కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.సమీక్షలో వర్ధన్నపేట, హుస్నాబాద్ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, సతీష్ బాబు. వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, వ్యవసాయాధికారులు ఉషాదయాళ్, డీఆర్‌డీవో పీడీలు శ్రీనివాస్ కుమార్, సంపత్ రావు పాల్గొన్నారు.

# నిరుద్యోగ భరోసా బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ : పొంగులేటి



ఖమ్మం, మే1: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్రకు మాజీ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి మద్దతు ప్రకటించారని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మిడతనపల్లి విజయ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించిన మాజీ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మిడతనపల్లి విజయ్, జేఏసీ నాయకులు.ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జేఏసీ చేస్తున్న పోరాటానికి మా యొక్క పూర్తి సహకారం ఉంటుందని,ఈ యొక్క తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మిడతనపల్లి విజయ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్రమంతట విద్యార్థులకు భరోసా కల్పించాలని ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్ర కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ నుండి తేదీ 03 మే 2023 ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుంది.కాబట్టి నిరుద్యోగ విద్యార్థులంతా విజయవంతం చేయాలని,పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని టిఎస్పిఎస్సి బోర్డులో ఉన్నటువంటి మెంబర్స్ అందరినీ తొలగించి,నూతన నియామక బోర్డును ఏర్పాటు చేయాలని,2014నుండి2023వరకు జరిగిన అన్ని నియామకాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని,వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగ విద్యార్థులకు ప్రతినెల5000 రూపాయలు నియామక ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ఇవ్వాలని,యూనివర్సిటీల కామన్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వనీ వెనక్కి తీసుకోవాలని, ప్రతి సంవత్సరం ఉద్యోగ భర్తీ క్యాలెండర్ విడుదల చేయాలని,అన్ని యూనివర్సిటీలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ,తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ విద్యార్థి జేఏసీ మరియు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ తరపున రాష్ట్రమంతటా అన్ని యూనివర్సిటీలలో మరియు జిల్లా కేంద్రాలలోనూ నిరుద్యోగ విద్యార్థి సదస్సు నిర్వహించి విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై విద్యార్థులను చైతన్యవంతం చేసి, వారికి భరోసా కల్పిస్తామని,ప్రభుత్వం దిగివచ్చి విద్యార్థి నిరుద్యోగులకు న్యాయం చేసేంతవరకు పోరాటం నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు రెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్,ఉరిబెండి వెంకట్ యాదవ్,ఆంజనేయ ముదిరాజ్, కాంపాటి వెంకట్ గౌడ్, వీర రాజుయాదవ్,మోహన్ నాయక్, వినోద్,రమేష్,జనార్ధన్ ముదిరాజ్ ,లీందర్,రవి, కిరణ్,నవీన్, అశోక్,మహేష్ యాదవ్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

మెదక్, మే1: (నేటినిజం ప్రతినిధి ):రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రాష్ట్ర రహదారుల ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ రమేష్ తో కలిసి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతూ మానవ తప్పిదాలు, రోడ్డు నిర్మాణంలో కొన్ని లోపాల వల్ల ప్రమాదాలు జరుగుతూ మృత్యువాత పడుతుండడం భాధాకరమన్నారు.

ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధలను పాటించేలా చూడాలని, అధికారులు కూడా బ్లాక్ స్పాట్ లుగా గుర్తించిన ప్రాంతాలలో రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటివి ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాలలో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కోటి 71 లక్షలతో అల్లాదుర్గ్, బొడమెట్పల్లి జంక్షన్ వద్ద 161–జాతీయ రహదారి ఎగ్జిట్ రాంప్, మీడియన్ ఓపెనింగ్ కు త్వరగా రీజనల్ ఆఫీసు నుండి అనుమతులు పొంది పనులు ప్రారంభించవలసినదిగా సూచించారు. నరసాపూర్ నుండి మెదక్ వరకు 765–డి రోడ్డులో లోతువాగు, పోతంశెట్టిపల్లి, కిష్టాపూర్ వంటి పది ప్రాంతాలలో ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున రంబుల్ స్ట్రిప్స్ వేయుటకు ప్రతిపాదనలు రూపొందించి, ఆమోదంతో పనులు చేపట్టవలసినదిగా అధికారులకు సూచించారు. వెల్కమ్ బోర్డు దగ్గా 7 కోట్ల 70 లక్షల వ్యయంతో 120 మీటర్ల మేర రోడ్డు వెడల్పు పనులు చేపట్టవలసినదిగా ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. జాతీయ రహదారి 44 లో 70 కోట్ల వ్యయంతో చేపట్టే వడియారం, చెట్ల తిమ్మాయిపల్లి బైపాస్ జంక్షన్, సెంట్రల్ లైటింగ్ పనులను, 10 కోట్ల వ్యయంతో చేపట్టి రామాయంపేట సర్వీస్ రోడ్ పనులకు రీజినల్ కార్యాలయం నుండి అనుమతులు పొంది వెంటనే పనులు ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. యెన్.హెచ్–44 లో గుర్తించి మిగిలిన 3 బ్లాక్ స్పాట్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.ఈ సమావేశంలో యెన్.హెచ్. ఆర్ ఈ విజయ రాజు, ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్ రెడ్డి, 76–డి యెన్.హెచ్ ఆర్ ఈ రమేష్, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశం, రామకృష్ణ, జిల్లా రవాణాధికారి శ్రీనివాస్ గౌడ్, డిఎస్పీ సైదులు, అబ్కారీ పర్యవేక్షకులు రజాక్, ఆర్టీసీ డిఎమ్ రవిచంద్రన్, తూప్రాన్ మునిసిపల్ కమిషనర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ఆర్జీదారుల సమస్యలు పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపాలి - అదనపు కలెక్టర్ వీరారెడ్డి



సంగారెడ్డి, మే 01 (నేటినిజం ప్రతినిధి): ప్రజావాణిలో ఆర్జీదారుల నుండి అందిన దరఖాస్తులను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి జిల్లా అధికారులకు ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఆయన ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడానికి చొరవ చూపాలని సూచించారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం (16) దరఖాస్తులు వచ్చాయని, అందులో భూ సమస్యలకు సంబంధించి (6), ఇతర శాఖలకు సంబంధించి (10) దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తుదారుల నుండి అందిన దరఖాస్తులను పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ కార్యదర్శులకు కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ సంఘీభావం



రాజన్న సిరిసిల్ల, మే1:(నేటి నిజం ప్రతినిధి): కోనరావుపేట మండల కేంద్రంలో గత నాలుగు రోజుల నుండి చేస్తున్నపంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మెకు రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూజూనియర్ పంచాయతీ సెక్రెటరీ, ఔట్సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీలను వెంటనే రెగ్యులర్ చేయాలని అన్నారు. సంవత్సరాల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని, విధినిర్వహణలో మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలలో ఒకరికి కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు.

గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకు లేచి గ్రామలలో ప్రతి పనిని పర్యవేక్షించి పైఅధికారులకు తెలిపేది పంచాయతీ కార్యదర్శులేనని, కాబట్టి వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిగణలోకి తీసుకొని న్యాయం చేయాలని అన్నారు. వారి వెంట మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా, నిజామాబాద్ గ్రామ సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, జగన్మోహన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, చేపూరి గంగాధర్, గొట్టే రుక్మిణి, కచ్చకాయల ఎల్లయ్య, చందనగిరి గోపాల్, తాళ్లపల్లి ప్రభాకర్, ముదాం సత్యం, మాంధాల లింబయ్య, పెంతాల శ్రీనివాస్, బందేల సదానందం, మంగలి పెల్లి శంకర్, రాస రవీందర్ రెడ్డి, దూర్ల నారాయణ, పాతకాల ప్రకాష్, వంగపల్లి శోభన్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# నెల 3న ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన - జిల్లా కలెక్టర్

సంగారెడ్డి, మే 01(నేటినిజం ప్రతినిధి): జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 3న( బుధవారం) టీఎన్జీ భవనంలోప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి పథకం - తయారీ సంస్థల క్రమ బద్ధీకరణ క్రింద ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. అసంఘటిత సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ రంగ నాణ్యత ప్రమాణాల అభివృద్ధి చేయడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం నిర్వహిస్తున్నదని తెలిపారు. సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు రుణ సదుపాయం కల్పించడం, పరిశ్రమల సామర్థ్యాభివృద్ధికి, అందుకు సాంకేతిక తోడ్పాటును అందించడం, ఆహార శుద్ధి రంగాన్ని సంస్థా గతంగా బలోపేతం చేయడం, ఉత్పత్తుల మార్కెటింగ్ మరియు బ్రాండింగ్ నకు తోడ్పాటు అందించడం, సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు మౌలిక సదుపాయాల కల్పన ఈ పథక ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సంగారెడ్డి లోని అంబేద్కర్ స్టేడియం ఎదురుగా గల టీఎన్జీవో భవనంలో ఈ నెల 3న వివిధ పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన కోసం అందిస్తున్న తోడ్పాటు గురించి ఔత్సాహికులకు వివిధ శాఖల అధికారులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. అదేవిధంగా బ్యాంకుల నుండి సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం పొందడానికి విధి, విధానాల గురించి తెలియజేస్తారని పేర్కొన్నారు. సూక్ష్మ పరిశ్రమల స్థాపన కోసం ఉపయుక్తమైన అధునాతన యంత్ర పరికరాల గురించి ఈ ప్రదర్శనలో ప్రయోగాత్మకంగా వివరిస్తారని తెలిపారు. వ్యవసాయ ఆధారిత యూనిట్ల నెలకొల్పనకు అర్హులైన వారికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇట్టి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ మిషనరీ ప్రదర్శనను స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎఫ్ పి ఓ లు, కో-ఆపరేటివ్ సొసైటీలు, వ్యక్తిగత ఆసక్తి కలిగిన వారు, ఇప్పటికే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపించుకున్న వారు, నిరుద్యోగ యువత, ఫుడ్ ప్రాసెసింగ్ పై ఆసక్తి కలిగి ఉన్నవారు, ఔ స్తాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# కార్మికుల పక్షపాతి మంత్రి పువ్వాడ:సుడాచైర్మన్




ఖమ్మం, మే1: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్ మున్సిపల్ కార్పొరేషన్ నందు మేడే సందర్భంగా(బిఆర్టియు) భారత రాష్ట్ర తెలంగాణ యూనియన్ ఖమ్మం పట్టణ కార్యదర్శి బుర్రి వినయ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ,ఖమ్మం సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్,బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు,సిటీ లైబ్రరీ చైర్మెన్ మహ్మద్ అష్రిఫ్ పాల్గొని బీఆర్టియు జండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించిన రోజే ఈ మేడే అని తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రగతి ఫలాలు అన్ని వర్గాలకి చేరుతున్న వేళ కార్మికుల జీవితాల్లో సరికొత్త వెలుగులు విరజిమ్మలని ఆకాంక్షిస్తూ శమ,శక్తిని నమ్ముకున్న కార్మిక లోకానికి మేడే శుభాకాంక్షలు తెలియజేశారు.కార్మిక లోకం లేకపోతే మనిషి జీవితంలోగాని,సమాజంలోగాని,కంపెనీల మనుగడ ఉండదని అన్నారు.కార్మికుల కష్టానికి తగిన ఫలితం ఇచ్చేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నో చట్టాలను అమలు చేస్తుందని తెలియజేశారు.ఎల్లప్పుడు కార్మికులందరికీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహకారం ఉంటుందని తెలియజేశారు.అనంతరం బిఆర్ఎస్వివి/ బిఆర్టియు యూనియన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని మాయాబజార్ స్కూల్ ఆటో అడ్డా నందు ఏర్పాటుచేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఖమ్మం సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ పాల్గొని బిఆర్టియు జెండా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్టియు భారత రాష్ట్ర తెలంగాణ యూనియన్ మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు సెక్రటరీ జ్యోతి,కిరణ్, తిరుమల్ రెడ్డి, జావిద్, బాబు, నత్య, కరుణాకర్, లక్ష్మీనారాయణ,గుమ్మడి రమేష్,వెంకటేష్,గౌస్, ప్రసాద్,పృథ్వి,రాము,శ్రీను తదితరులు ఉన్నారు.

# కార్మికుల సేవలు వెలకట్టలేనివి

## -మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి
## -మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణ




రాజన్న సిరిసిల్ల, మే1:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం అంతర్జాతీయ 137వ మేడే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి హాజరయ్యారు.

అలాగే సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో రక్తం, చెమట ధారపోసే కార్మికుల శ్రమను గుర్తించి గౌరవించే రోజు మేడే అని కొనియాడారు. అమెరికాలోని చికాగో నగరంలో కార్మికుల మార్క్సిస్టు ఉద్యమం చేసి ప్రాణాలు సైతం కోల్పోయి 18 గంటలు ఉన్న పని దినాలను 8 గంటల వరకు తగ్గించుకున్నారని, 19వ శతాబ్దంలో కార్మికులను బానిసలు కంటే హీనంగా చూశారని అన్నారు. కార్మికులను శ్రమ దోపిడీ చేశారని, ట్రేడ్ యూనియన్లు ఏర్పడం వల్ల కార్మికుల్లో చైతన్యం పెరిగిందని అన్నారు. మున్సిపల్ కార్మికులు కోవిడ్ వంటి విపత్కర పరిస్థితిలో ఎనలేని సేవలు చేసి ఫ్రంట్ లైన్ వారియర్స్ గా నిలబడ్డారని అన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉందంటే అది కేవలం మున్సిపాలిటీ సానిటేషన్ సిబ్బంది వల్లేనని, మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేని అన్నారు. కార్మికుల కష్టాలు గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులు గౌరవప్రదంగా బతకాలని కార్మికులకు 6,500 ఉన్న వేతనాన్ని 12వేలకు పెంచారని, సంవత్సరం కింద 12వేల ఉన్న వేతనాన్ని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 30 శాతం ఇచ్చి 15,600 పెంచిన ఘనత సీఎం కేసీఆర్ దేనని అన్నారు. కార్మిక పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్ అని, మున్సిపల్ కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్న ఎమ్మెల్యే రమేష్ బాబు దృష్టికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పుల్కం రాజు, సంగే స్వామి గార్లు, కౌన్సిలర్లు మారం కుమార్, బింగి మహేష్, సిరిగిరి చందు, ఇప్పపూల అజయ్, కుమ్మరి శిరీష శ్రీను, రామతీర్థపు కృష్ణవేణి హరీష్, గడ్డమీది లావణ్య శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు షేక్ సర్వర్ అలీ, సిఐటియు నాయకులు ఎగుమంటి ఎల్లారెడ్డి, ముక్తి కాంతం అశోక్, యూనియన్ నాయకులు బట్టు శ్రీకాంత్, పందుల మల్లేశం, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పొట్టలు కొడుతున్న బీజేపీ సర్కార్‌ను గద్దె దింపాలి

## -సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు




నేటి నిజం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి స్వాతంత్రం కంటే ముందు నుండి కార్మిక వర్గం సంఘటితంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర బిజెపి సర్కార్ రద్దు చేసిందని, కార్పొరేట్ల లాభాల కోసం నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందని దీంతో కార్మికుల పొట్టలు కొట్టి కార్పొరేట్ల బొజ్జలు నింపుతున్న బిజెపిని మేడే స్ఫూర్తితో మోడీని గద్దె దించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు.ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా సోమవారం వేములవాడ మహంకాళి సెంటర్లో సిపిఎం జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం సిఐటియు సిపిఎం కార్యకర్తలు మేడే ర్యాలీ నిర్వహించారుమున్సిపల్ ఆఫీసు ముందు మున్సిపల్ చైర్మెన్ రామతీర్థపు మాధవి సీఐటీయూ జెండాను ఎగురవేశారు. తిప్పాపూర్ లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్ సీఐటీయూ జెండాను ఎగురవేశారు. మహంకాళి సెంటర్లో సీఐటీయూ జెండాను వార్డు కౌన్సిలర్ కుమ్మరి శ్రీనివాస్ సీఐటీయూ కార్యాలయం వద్ద సీపీఎం పట్టణ కార్యదర్శి ముక్తికాంత అశోక్ జెండాను ఎగురవేశారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ప్రపంచ కార్మిక వర్గం ఐక్యంగా సంఘటితంగా 1886 మే 1న అమెరికా దేశం చికాగో నగరంలో హే మార్కెట్ వద్ద భారీగా ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక వర్గంపై పోలీసులు కాల్పులు జరిపి అనేకమంది కార్మికుల రక్తాన్ని కళ్ళజూసిందని కార్మికుల రక్తం ఏరులై పారుతున్న సందర్భంలో ఆ కార్మికులలో ఒకరు కొన ఊపిరితో ఉన్నవారు తమ ఈచొక్కాను రక్తపు మడుగులో ముంచి నిలబెట్టిన ఈ ఎర్రజెండా కార్మికులందరికీ కష్టజీవులందరికీ కల్పతరువు లాంటిది అని చెప్పారు. నాడు 18 గంటల పని విధానం ఉండగా అనేక కార్మికు ఉద్యమాల ఫలితంగా నేటి ఎనిమిది గంటల పని విధానం వచ్చిందన్నారు. కేంద్ర బీజేపీ సర్కార్ నేడు 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిందని కార్మికుల కనీస వేతనాన్ని విస్మరిస్తుందని, అసంఘటిత రంగ కార్మికులకి పిఎఫ్ ఈఎస్ఐ వంటి కనీస సౌకర్యాలు కూడా ఇవ్వడం లేదని, కార్మిక సంక్షేమాన్ని గాలికొదిలిన బిజెపి సర్కార్ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం అంబానీ, ఆదానీల కోసమే దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. బిజెపిని గద్దదించకపోతే కష్టజీవుల జీవితాలు మరింత దుర్భర మవుతాయని చెప్పారు. కష్టజీవుల విభక్తి మార్గం ఎర్రజెండాను ఇంటి ఆడబిడ్డల ఆదరించాలని ఆయన పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం 26 400 రూపాయలు ఇవ్వాలన్నారు. కార్మికుల పొట్టలు కొడుతూ ఆదాని వంటి కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు మేడే స్ఫూర్తితో మోడీని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు శ్రీకాంత్, యూనియన్ నాయకులు కార్యదర్శి మల్లేశం, లచ్చయ్య, ఎద్ల బాబు, వజ్రమ్మ వావిలాల లక్ష్మి, రాధ, మమత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నివాస స్థలాల క్రమబద్ధీకరణ

## -దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి



ఖమ్మం, మే1: (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ ఉత్తర్వులు 58 క్రింద ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకొన్న వారు, ఆయా స్థలాల క్రమబద్ధీకరణకు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం ఐడిఓసిలోని సమావేశ మందిరంలో అధికారులతో జీవో 58 క్రింద స్థలాల క్రమబద్ధీకరణ పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రమబద్ధీకరణ కు కటాఫ్ తేదీ 2014, జూన్ 2 ఉండగా, ప్రభుత్వం అట్టి కటాఫ్ తేదీని 2020, జూన్ 2 కు పొడిగించినట్లు తెలిపారు. దీంతో 2020 జూన్, 2 వరకు నివాసం ఏర్పరచుకొని ఉన్నవారు క్రమబద్ధీకరణ కు అర్హులవుతారని ఆయన అన్నారు. పొడిగించిన కటాఫ్ తేదీకి దరఖాస్తు చేసుకొనుటకు ప్రభుత్వం ఏప్రిల్, 30 వరకు గడువు ఇచ్చినట్లు ఆయన అన్నారు. గతంలో కటాఫ్ తేదీ దాటిన వారి దరఖాస్తులు తిరస్కరణ కు గురయినట్లు, అట్టి దరఖాస్తుదారులు తిరిగి దరఖాస్తు చేశారన్నారు. కటాఫ్ తేదీ మార్పు తర్వాత అర్హులుగా ఉన్న వారిని గుర్తించి, వారు దరఖాస్తు చేసేవిధంగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తుల పరిశీలన చేసి, 3,253 దరఖాస్తులను ఆమోదించి, 2,720 పట్టాల పంపిణీ పూర్తి చేసినట్లు ఆయన అన్నారు. క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుల్లో 5,346 తిరస్కరణకు గురికాగా, క్రొత్తగా 3,404 గృహాలను గుర్తించినట్లు, సోమవారం వరకు మొత్తంగా 13,517 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు ఆయన అన్నారు. అర్హులైన వారికి త్వరితగతిన పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, డిఆర్వో శిరీష, ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ రెవిన్యూశాఖ సూపరింటెండెంట్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, మే1:(నేటినిజం ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులు, ఫిర్యాదులకు సంబంధిత అధికారులు స్పందించి, సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.సోమవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోనిఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు బి.సత్య ప్రసాద్, ఎన్. ఖీమ్యా నాయక్ లతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందని అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించి, అట్టి దరఖాస్తులకు సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 10 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్.డి.వో., శ్రీనివాస్ రావు, వేములవాడ ఆర్డీఓ పవన్ కుమార్, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరెపల్లి గ్రామంలో పాఠశాల నిర్మాణం చేపట్టాలి-సర్పంచ్ నవీన్ రాజు

రాజన్న సిరిసిల్ల, మే1:(నేటినిజం ప్రతినిధి):, వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ నవీన్–రాజు అధికారులను కోరారు.

గతంలో గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, అయినప్పటికీ ఆరెపల్లి గ్రామానికి మాత్రం స్కూల్ మంజూరుచేయలేదన్నారు. గ్రామం ముంపునకు గురైన ఐదేళ్ల నుండి పాఠశాల లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో వసతి గదులనిఅద్దెకు తీసుకొని సొంత డబ్బులతో పాటశాల

నిర్వహణచెవుడుతున్నామని అన్నారు. ఇప్పటికైనా జూన్ వరకు ఆరెపల్లి గ్రామానికి స్కూల్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామంలో నిర్మాణమైన వైకుంఠదామానికి ఇప్పటివరకు బిల్లు మంజూరుకాలేదని, త్వరితగతిన బిల్లు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు.

# రిటైర్డ్ టీచర్ కుటుంబానికి ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ



రాజన్న సిరిసిల్ల, మే1:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో ఇటీవల మరణించిన నునుగొప్పుల రాజయ్య యాదవ్ (రిటైర్డ్ టీచర్) కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మహేష్, విజయ్ యాదవ్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# ఎన్నడూ లేని విధంగా అత్యధిక పన్నుల తరువాత లాభం 585 కోట్ల రూపాయలు సాధించిన పూనావాలా ఫిన్ కార్ప్



హైదరాబాద్, మే1:విని యోగదారు మరియు ఎంఎస్ఎంఈ ఫైనాన్స్‌పై దృష్టి సారించిన , ఎన్ బి ఎఫ్ సి పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్ డైరెక్టర్ల బోర్డు, ఈ రోజు మార్చి 31, 2023తో ముగిసిన త్రైమాసిక మరియు సంవత్సరానికి ఆడిట్ చేయబడిన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ముఖ్యాంశాలు - 2023 ఆర్థిక సంవత్సర నాల్గవ త్రైమాసం (స్వతంత్రం):

ఆస్తులు: 151% ఇయర్ ఆన్ ఇయర్ మరియు 89% క్యు ఆన్ క్యు తో 6,371 కోట్ల రూపాయల అత్యధిక త్రైమాసిక చెల్లింపులు.- నిర్వహణలో ఉన్న ఆస్తులు 16,143 కోట్ల రూపాయల వద్ద, 37% ఇయర్ ఆన్ ఇయర్ మరియు 16% క్యు ఆన్ క్యు - వితరణ లో డైరెక్ట్ డిజిటల్ ప్రోగ్రామ్ సహకారం 2023 ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసం లో 66%తో పోలిస్తే 2023 ఆర్థిక సంవత్సర నాల్గవ త్రైమాసం లో 81%కి మరియు 2022 ఆర్థిక సంవత్సర నాల్గవ త్రైమాసం లో 24%కి పెరిగింది.లాభదాయకత:- 2023 ఆర్థిక సంవత్సర నాల్గవ త్రైమాసం కి 103% ఇయర్ ఆన్ ఇయర్ మరియు 20% క్యు ఆన్ క్యు కి పెరిగి గరిష్టంగా 181 కోట్ల రూపా యలు గా ఉంది. 2023 ఆర్థిక సంవ త్సర కోసం, పన్నుల తరువాత లాభం 585 కోట్ల రూపాయలు గా ఉంది. 2023 ఆర్థిక సంవత్సర నాల్గవ త్రైమా సం కోసం నికర వడ్డీ మార్జిన్ 11. 3% వద్ద ఉంది, 87 బీపీఎస్ ఇయర్ ఆన్ ఇయర్ మరియు 59 బీపీఎస్ క్యు ఆన్ క్యు మెరుగుదల. 2023 ఆర్థిక సంవత్సర కోసం, నికర వడ్డీ మార్జిన్ 10.7% వద్ద ఉంది, ఇది 89 బీపీఎస్ సంవత్సరం మెరుగుదల సాధించింది.- 2023 ఆర్థిక సంవ త్సర నాల్గవ త్రైమాసం నిర్వహణ ఖర్చులు - 196 కోట్లుగా ఉన్నాయి, క్యు ఆన్ క్యు 4% తగ్గింది.- 2023 ఆర్థిక సంవత్సర నాల్గవ త్రైమాసం కి నిర్వహణ లాభం- 212 కోట్లు, 84% ఇయర్ ఆన్ ఇయర్ మరియు 36% క్యు ఆన్ క్యు వున్నాయి.డివిడెండ్: వాటాదారుల ఆమోదానికి లోబడి, 2023 ఆర్థిక సంవత్సర కి ప్రతి షేరుకు - 2 డివిడెండ్ (ముఖ విలువలో 100%) ఇవ్వాలని బోర్డు సిఫార్సు చేసింది.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.